# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 199 | హైదరాబాద్ | గురువారం 29-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

చుక్కలనంటిన పసిడి, వెండి.. రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు

### విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం
# అజిత్ పవార్ దుర్మరణం


11లో

- బారామతి వద్ద విమానం కూలి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి
- ప్రమాదంలో పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురి దుర్మరణం
- ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ల్యాండింగ్ సమయంలో ఘటన
- స్థానిక సంస్థల ఎన్నికల సభలకు వెళ్తుండగా జరిగిన విషాదం

## వికసిత్ భారత్‌కు 2026
### పునాది సంవత్సరం : రాష్ట్రపతి ముర్ము


11లో

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల

### మేడారంలో భక్తులకు ధరల షాక్..
## ఆకాశాన్నంటిన రేట్లు..

- ప్రారంభమైన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర
- భక్తులను బెంబేలెత్తిస్తున్న ఆకాశాన్నంటిన ధరలు
- కోళ్లు, మేకల ధరలు రెట్టింపు.. గదుల అద్దెలు వేలల్లో
- చెట్టు కింద నీడకు కూడా అద్దె వసూలు చేస్తున్న వైనం
- ధరల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని భక్తుల విజ్ఞప్తి


11లో



11లో

## శబరిమల బంగారం కేసులో
### కీలక మలుపు.. వీడిన చిక్కుముడి!

- శబరిమల బంగారం కేసులో కీలక శాస్త్రీయ ఆధారాలు
- గర్భగుడి తలుపులను మార్చలేదని తేల్చిన వీఎస్ఎస్‌సీ
- రాగి రేకులపై ఉన్న బంగారు పొరను రసాయనాలతో దోపిడీ
- ఈ మేరకు హైకోర్టుకు నివేదిక సమర్పించిన దర్యాప్తు బృందం
- త్వరలో తుది నివేదిక ఇస్తామని చెప్పిన శాస్త్రవేత్తలు

### నిఫా ఎఫెక్ట్: ఎయిర్‌పోర్టుల్లో మళ్లీ
## కోవిడ్ తరహా స్క్రీనింగ్

- పశ్చిమ బెంగాల్‌లో నిఫా కేసులతో అప్రమత్తమైన ఆసియా దేశాలు
- థాయ్‌లాండ్, నేపాల్, తైవాన్ ఎయిర్‌పోర్టుల్లో కోవిడ్ తరహా స్క్రీనింగ్
- బెంగాల్‌లో రెండే నిఫా కేసులు నమోదయ్యాయని స్పష్టం చేసిన కేంద్రం
- బాధితులతో సంబంధమున్న 196 మందికి నెగెటివ్ అని వెల్లడి



11లో


11లో

### అజిత్ పవార్ మృతికి..
## ఏపీ కేబినెట్ సంతాపం

- భేటీ ప్రారంభంలో పవార్ మరణాన్ని ప్రస్తావించిన సీఎం చంద్రబాబు
- సంతాపం తెలిపిన మంత్రిమండలి
- కేబినెట్ లో సంతాప తీర్మానం

### అగ్ని ప్రమాదాలకు
# హైడ్రా.. చెక్..!

- ఫైర్ సేఫ్టీ అంటే 'పైసా' ఖర్చు కాదు.. ప్రాణాలకు రక్షణ!
- నిబంధనలు తుంగలో తొక్కితే షాపులు సీజ్.. విద్యుత్ కట్!
- హైడ్రా యాక్షన్ ప్లాన్.. రంగంలోకి దిగుతున్న తనిఖీ బృందాలు
- ఫిర్యాదులకు 9000113667 నంబర్ కేటాయింపు



12లో

భారత శక్తి

# భారత్ బిగ్ డీల్...కుళ్లుకుంటున్న అమెరికా

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. తన ఏడాది పాలనలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ కాలం వెల్లదీశాడు. మిత్రులు, శత్రువు అనే తేడా లేకుండా 5 నుంచి 200 శాతం వరకు టారిఫ్‌లు విధించారు. దీంతో ప్రపంచంలో చాలా దేశాలు ఈ టారిఫ్‌ల కారణంగా ఇబ్బంది పడుతున్నాయి. చాలా మంది ఉపాధి కోల్పోయారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో చాలా కంపెనీలు ఉత్పత్తి తగ్గించాయి. ఉద్యోగులను తగ్గించాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, సౌత్ ఆఫ్రికాతోపాటు అనేక చిన్న దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా అమెరికాకు సన్నిహితంగా ఉండే యురోపియన్ యూనియన్‌ను మోదీ తన బుట్టలో వేసుకున్నాడు. అమెరికా అధ్యక్షుడు మాటను లెక్క చేయకుండా ఈయూ భారత్‌తో అతిపెద్ద వాణిజ్య ఒప్పందానికి సిద్ధమైంది. భారత్?యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ఏటీ) ద్వారా లక్షలాది మందికి పెద్ద అవకాశాలు లభిస్తాయని నరేంద్రమోదీ ప్రకటించారు. ఇది అంతర్జాతీయ వ్యాపారంలో మూడింట ఒక భాగాన్ని కలిగి ఉంటుందని వివరించారు. ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ) నాల్గవ సంప్రదింపు ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో ఇంధన రంగంలో డిమాండ్ ఊపందుకుంటోందని, ఈ ఒప్పందం ద్వారా పెద్ద స్థాయి పెట్టుబడులు ఆకర్షిస్తామని చెప్పారు. ఇది ఉమ్మడి ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేస్తూ, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలను పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాస్తవానికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఎప్పుడో జరగాల్సింది. కానీ అమెరికా కోసం మన దేశ రైతులను పణంగా పెట్టేందుకు మోదీ అంగీకరించడం లేదు. అనేక అంశాల్లో ఏకాభిప్రాయం రావడం లేదు. దీంతో వాణిజ్య చర్చలు నెలల తరబడి సాగుతున్నాయి. దీంతో భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం తగ్గించేందు మోదీ ఒక అడుగు ముందుకు వేసి ప్రపంచ దేశాలతో చర్చలు ప్రారంభించారు. ఒప్పందాలూ చేసుకుంటున్నారు. భారత్?ఈయూ ఒప్పందం కూడా ఇందులో భాగమే. అయితే దీనిని చూసి ఇప్పుడు అమెరికా కుళ్లుకుంటోంది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్, తమ దేశం రష్యా?ఉక్రెయిన్ సంఘర్షణను అరికట్టేందుకు ఎక్కువ రాజీలు చేసుకున్నామని, భారత్‌పై చమురు దిగుమతులకు అదనపు పన్నులు విధించామని గుర్తు చేశారు. అయినా ఈయూతో భారత్ సులభంగా ఒప్పందం కుదుర్చుకుందని విమర్శించార. తమ సహకారానికి తగిన గుర్తింపు లభించలేదని ఆక్షేపించారు. ఇది అంతర్జాతీయ వాణిజ్యంలో దేశాల మధ్య పోటీతత్వాన్ని, భౌగోళిక రాజకీయాల ప్రభావాన్ని సూచిస్తోంది. ఈ ఒప్పందం ఈయూ? భారత్‌కు యూరప్ మార్కెట్లలో సులభ ప్రవేశం అందిస్తూ, ఎక్స్‌పోర్ట్‌లను పెంచుతుంది. ఇంధన, ఆటో, టెక్ రంగాల్లో పెట్టుబడులు పెరిగి, ఆర్థిక వేగాన్ని పెంచవచ్చు. అయితే, అమెరికా విమర్శలు భవిష్యత్ వాణిజ్య ఒప్పందాల్లో టెన్షన్లను సృష్టించవచ్చు. రష్యా చమురు విషయంలో భారత్ స్వతంత్ర విధానం కొనసాగితే, యూఎస్‌తో సంబంధాలు బలపడే అవకాశం ఉంది. మొత్తంగా, ఈ డెవలప్‌మెంట్ భారత్ గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి సహాయపడుతుంది, ఇతర దేశాలు కూడా భారత్‌వైపు చూసేలా చేస్తుంది. మరో వైపు యూరప్‌లో తయారైన కార్లు (జెర్మన్, ఇటాలియన్ మోడల్స్) ధరలు 20?30% వరకు దిగవచ్చు. ఆలివ్ ఆయిల్, కివీ పండ్లు వంటి ఆహార పదార్థాలు, విస్కీ, వోడ్కా, బీర్, వైన్ లాంటి పానీయాలు, సిద్ధంగా ప్రాసెస్ చేసిన ఫుడ్ ఐటెమ్స్, పండ్ల రసాలు అందరికీ చౌక అవుతాయి. ఇలాంటి మార్పు ద్వారా మధ్యతరగతి కుటుంబాల ఖర్చులు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. భారత్ ఎగుమతి చేసే వస్తువుల్లో 90 శాతానికిపైగా యూరోపియన్ మార్కెట్లలో సుంకాలు ఉండవు. టెక్స్‌టైల్స్ రంగం (కాటన్ గార్మెంట్స్, సారీలు, హ్యాండ్‌లూమ్) పెద్దగా ప్రయోజనం పొందుతుంది, ఇటలీ, ఫ్రాన్స్ మార్కెట్లలో డిమాండ్ పెరుగుతుంది. కెమికల్స్ (ఫార్మా ఇంటర్మీడియేట్స్, పెస్ట్‌సైడ్స్) రంగం జర్మనీ, బెల్జియం వర్క్‌షాప్‌లకు సులభ ప్రవేశం పొందుతుంది. ఆభరణాలు (గోల్డ్, డైమండ్ జ్యువెలరీ) స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో ఎగుమతులు దాదాపు రెట్టింపు అవుతాయని అంచనా. ఇవి లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఎంఎస్ఎంఈలకు బూస్ట్ ఇస్తాయి. మొత్తం వాణిజ్యం వృద్ధి చెంది, జీడీపీ 1 నుంచి 2 శాతం వృద్ధికి దోహదపడవచ్చు. ఈ ఒప్పందం రెండు ప్రాంతాల మధ్య పరస్పర పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. యూరప్ నుంచి టెక్నాలజీ, మెషినరీ దిగుమతులు పెరిగి, భారత పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. భారత్ నుంచి ఐటీ, ఆటో పార్ట్స్ ఎగుమతులు పెరిగి, సరఫరా బలపడుతుంది. అయితే, స్థానిక ఉత్పాదకులు పోటీకి సిద్ధంగా ఉండాలి. మొత్తంగా, ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా మార్చి, మధ్య తరగతి ఆదాయాలను పెంచుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహం గురించి అందరికీ తెలిసిందే. ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు భారత ప్రధాని మోదీతో మంచి స్నేహ సంబంధాలను నెరిపారు. కానీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ట్రంప్ అసలు స్వరూపం బయటకు రావడం మొదలైంది. ఆపరేషన్ సింధూర్‌ను తానే ఆపానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు. భారత్ ఖండించినప్పటికీ అమెరికా అధ్యక్షుడి తీరు మారలేదు. అంతే కాదు పాకిస్థాన్‌తో దోస్తీ చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు ట్రంప్. అంతే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీ అంటూ ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తమ మాట వినకపోతే భారత్‌కు భవిష్యత్తు లేదనేది ట్రంప్ మాటల ఉద్దేశంగత ఏడాది యూకేతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న భారత్.. న్యూజిలాండ్‌తోనూ ట్రేడ్ డీల్ చేసుకుంది. ఒమన్‌తో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు యూరోపియన్ యూనియన్‌తో ఏకంగా మదర్ ఆఫ్ డీల్స్‌గా చెప్పుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఆస్ట్రేలియా, కెనడా, చిలీ లాంటి దేశాలతోనూ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి భారత్ చర్చలు జరుపుతోంది. తద్వారా అమెరికాకు ప్రత్యామ్నాయ మార్కెట్లు లభించడంతోపాటు.. మనకు అవసరమైన వనరులను ఈ దేశాల నుంచి పొందడానికి అవకాశం కలగనుంది. ట్రంప్ వైఖరి వల్ల భారత్‌తోపాటు యూరప్ దేశాలు సైతం విసిగిపోయాయి. అమెరికా పొరుగు ఉన్న కెనడాకు సైతం అగ్రరాజ్యం తీరు ఏమాత్రం నచ్చడం లేదు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా నిలబెడతామని టారిఫ్ వార్ మొదలుపెట్టిన ట్రంప్.. ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే సమయంలో అమెరికా తీరుతో విసిగిపోయిన దేశాలు.. బహుళ ధ్రువ ప్రపంచం దిశగా వేగంగా అడుగులేస్తున్నాయి. ఇందులో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది.

# ఏజెన్సీ ప్రాంతాలను హడలెత్తిస్తున్న పులి

ఏలూరు, జనవరి 28 (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణలోని కావడిగుడ్ల ప్రాంతం నుండి ఏపీలోకి ప్రవేశించిన ఒక పెద్ద పులి, గత నాలుగు రోజులుగా ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలను వణికిస్తోంది. పందిరిమామిడిగూడెం, ఇనుమూరు, గాడిదబోరు, అంతర్వేదిగూడెం వంటి ప్రాంతాల్లో సంచరిస్తూ ఇప్పటికే కొన్ని పశువులపై దాడి చేసిన ఈ పులి, తాజాగా కన్నాపురం ఫారెస్ట్ పరిధిలోని బిలిమిల్లి గ్రామంలో మరో రెండు పశువులను హతమార్చింది. దాంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పొలాలకు వెళ్లడానికి కూడా రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ పనికి వెళ్లడం లేదని, పులిని త్వరగా పట్టుకోవాలని అటవీశాఖ అధికారులను కోరారు. కొయ్యలగూడెం, బుట్టాయగూడెం పరిసర ప్రాంతాలవారు సాయంత్రం తరువాత ఒంటరిగా తిరగవద్దని, పొలాలకు కూడా వెళ్లవద్దని కన్నాపురం రేంజ్ అధికారి భానుప్రకాశ్, ఎమ్మార్వో నాగరాజు, సబ్ డీఎఫ్ఓ వెంకట సుబ్బయ్య ప్రజలను హెచ్చరించారు. ఈ క్రమంలోనే దిప్పకాయలపాడు - బిలిమిల్లి మధ్య రోడ్డు పక్కన ఉన్న మొక్కజొన్న తోటలో పులి కదలికలు డ్రోన్ కెమెరాకు చిక్కాయి. కెమెరా అలజడికి పులి పరుగులు తీయడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పులి సంచారం దృష్ట్యా అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి ఆచూకీని నిరంతరం పర్యవేక్షించేందుకు 19 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాకుండా, దానిని బంధించేందుకు రెండు బోనులను కూడా సిద్ధం చేశారు. రాత్రి వేళల్లో పులి సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రయాణించే అవకాశం ఉందని, అది కరగపాడు, కొవ్వాడ మీదుగా నేషనల్ పార్కులోకి ప్రవేశించవచ్చని డీఎఫ్‌వో పి.వి. సందీప్‌రెడ్డి అంచనా వేశారు. ఈ లోపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు, పులి ఆవాస ప్రాంతాలకు చేరువలో ఉండటంతో అధికారులు ప్రజలను హెచ్చరించారు. సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య, తహసీల్దారు నాగరాజు ఆధ్వర్యంలో గ్రామాల్లో టాంటాం వేయించి, ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని, పొలాలకు వెళ్లవద్దని సూచించారు. బుట్టాయగూడెం-కన్నాపురం మార్గంలో పులి రహదారి దాటుతుండగా కారు యజమానులు గమనించినట్లు సమాచారం అందడంతో, ఆ పరిసర ప్రాంత వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. ఏలూరు జిల్లా



కొయ్యలగూడెం మండలంలో బిల్లిమిల్లిలో పెద్ద పులి సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. దిప్పకాయలపాడు, బిల్లిమిల్లి మధ్యలో రోడ్డు పక్కన తోటలో డ్రోన్ కెమెరాకు చిక్కిన పులి చిక్కింది. అయితే కెమెరా అలజడికి భయపడిన పులి అక్కడినుంచి పరుగులు తీసినట్లు అధికారులు గుర్తించారు. చుట్టుపక్కల ప్రాంతాలవారు పులి ఎప్పుడు తమపై దాడి చేస్తుందేమోనని భయంతో వణికిపోతున్నారు.

# లోకేష్‌కు, పవన్ కు ప్రమోషన్



విజయవాడ, జనవరి 28 (భారత శక్తి ప్రతినిధి)

ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. మరో నెలలో రెండేళ్ల పాలన పూర్తవుతుంది. ఇప్పటివరకు సజావుగా పూర్తి చేసామన్న సంతృప్తి కూటమిలో ఉంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని చెబుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయ నిర్ణయాల దిశగా కూటమి ముందుకు వెళ్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. మంత్రి నారా లోకేష్ ప్రమోషన్, పట్టాభిషేకం వంటి ప్రచారం సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. ఇటువంటి తరుణంలో పవన్ పాత్ర ఎలా ఉండబోతుంది అనేది చర్చ. ఒకవేళ లోకేష్ కు ప్రమోషన్ కల్పించాలంటే పవన్ నుంచి అభ్యంతరం రాదా? అనే చర్చ కూడా బలంగా సాగుతోంది. అయితే ఏది ఏమైనా మూడు పార్టీలు కలిసి ముందుకెళ్లాలని బలంగా నిర్ణయించుకున్నాయి. అందుకే కూటమి అంతర్గత నిర్ణయాలు సైతం మూడు పార్టీల మధ్య జరగాలన్నది ఒక ప్రతిపాదనగా ఉన్నట్లు తెలుస్తోంది. 2027 ద్వితీయార్థంలో మంత్రి నారా లోకేష్ ప్రమోషన్ ఉంటుందన్న చర్చ నడుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవితో పాటు డిప్యూటీ సీఎం హోదా కల్పిస్తారని టాక్ నడుస్తోంది. కానీ ఇప్పటికే పార్టీ పై పూర్తిస్థాయిలో పట్టు సాధించారు లోకేష్. ఆపై తన మంత్రి పదవి విషయంలో సైతం సక్సెస్ అయ్యారు. పెట్టుబడుల సాధన, పరిశ్రమల ఏర్పాటు వంటి విషయంలో విజయం సాధించారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. అదే సమయంలో బిజెపి అగ్ర నేతల ఆశీస్సులు కూడా అందుకున్నారు. వారి అభిమానాన్ని చూరగొన్నారు. అయితే ఏకంగా లోకేష్ కు ముఖ్యమంత్రి పదవి కట్ట పెడతారన్న ప్రచారం నడుస్తోంది. అయితే అంతటి సాహసానికి దిగుతారా అనేది చర్చ. ఎందుకంటే అమరావతి రాజధానిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థల ఏర్పాటు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికార మార్పిడి జరిపితే దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. అందుకే ఇందులో ఎంత మాత్రం నిజం లేదని తెలుస్తోంది. రాష్ట్రంలో లోకేష్ ప్రమోషన్, పవన్ కళ్యాణ్ కు ప్రత్యామ్నాయ అవకాశాలు జరగాలంటే 2029 ఎన్నికల తరువాతే. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఏపీలో మంత్రిగా ఉన్నారు. ఆపై డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు. మరోవైపు సనాతన ధర్మం అంటూ జాతీయ స్థాయిలో సైతం ప్రభావం చూపుతున్నారు. తరచూ వివిధ రాష్ట్రాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో సైతం వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో పవన్ కళ్యాణ్ ద్వారా రాజకీయం చేయాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. ఈ పరిస్థితులు చూస్తుంటే 2029 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. కేంద్ర క్యాబినెట్ లో కీలక బాధ్యతలు కట్టబెట్టి జాతీయస్థాయి రాజకీయాల కోసం పవన్ కళ్యాణ్ ను వాడుకుంటారు అన్న చర్చ జోరుగా సాగుతోంది. 2029 సార్వత్రిక ఎన్నికలతోపార్టీ ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. మూడు పార్టీలు ఉమ్మడిగా ముందుకు వెళ్తాయి. పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేస్తారు. లోకేష్ తిరిగి అసెంబ్లీకి పోటీ చేస్తారు. కూటమి తప్పకుండా అధికారంలోకి వస్తుందన్న నమ్మకం వారిలో ఉంది. అప్పుడు కూడా చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఖాయం. కేంద్రంలో పవన్ కళ్యాణ్ తిరుగులేని శక్తిగా ఉంటారు. ఏపీలో కూటమికి రక్షణ కవచంగా నిలుస్తారు. అటువంటి సమయంలో చంద్రబాబు వయసు దృష్ట్యా సీఎం పదవి నుంచి తప్పుకుంటే లోకేష్ కు పట్టాభిషేకం చేయడం ఖాయం. కేంద్ర పెద్దల భరోసాతో, పవన్ కళ్యాణ్ సమ్మతితో ఇది జరిగే అవకాశం ఉంది. అంటే రాష్ట్రంలో పదవుల మార్పు అనేది 2029 ఎన్నికల్లో విజయాలను అనుసరించి ఉంటుంది. అంతవరకు ఎటువంటి మార్పు ఉండదు అన్నది విశ్లేషకుల మాట. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# అరవ శ్రీధర్ పై విచారణ షురూ



కడప, జనవరి 28 ((భారత శక్తి ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఏపీలో కూటమి ప్రభుత్వంలో కీలకమైన పార్టీగా ఉన్న జనసేన ఎమ్మెల్యే కు సంబంధించిన ఒక వీడియోను వైసీపీ బయట పెట్టింది. ఆ వీడియో అత్యంత దారుణంగా ఉంది. అందులో మాట్లాడిన భాష కూడా అత్యంత హేయంగా ఉంది. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ కు సంబంధించిన ఒక వీడియోను వైసీపీ బయట పెట్టింది..” ఏడాది క్రితం నుంచి ఒక మహిళను వేధిస్తున్నాడు. ఉద్యోగం పేరుతో ఆమెను ఇబ్బంది పెడుతున్నాడు. 2024 శాసనసభ ఎన్నికల్లో శ్రీధర్ రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి గెలిచారు. ఆయన గెలిచిన తర్వాత ప్రభుత్వ శాఖలో కిందిస్థాయి ఉద్యోగిగా పని చేస్తున్న ఓ మహిళ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేసింది. ఆ సందేశానికి శ్రీధర్ రిప్లై కూడా ఇచ్చారు.. ఇక అప్పట్నుంచి ఆమెతో శ్రీధర్ చనువు పెంచుకున్నారు. నీతో మాట్లాడాలి.. వ్యక్తిగతంగా కలవాలి అంటూ ఆమెకు అనేక సందర్భాలలో మెసేజ్ పెట్టారు. దీంతో ఆమె ఆందోళనకు గురైంది. ఆ తర్వాత ఎమ్మెల్యే గారూ ఇలా అంటున్నారు అంటూ సమాధానాన్ని దాటవేసిందని” వైసిపి ఆ వీడియోను ఉద్దేశించి వ్యాఖ్యానించింది.” నీ పేరు ఏంటి? తల్లిదండ్రులు ఎవరు? ఎక్కడ ఉద్యోగం చేస్తున్నారు? వివాహం జరిగిందా? భర్త ఏం చేస్తుంటాడు? పిల్లలు ఎంతమంది? మీ వయసు ఎంత? మీ ఇంటి చిరునామా చెప్పండి” అంటూ శ్రీధర్ ఆమె వివరాలు తీసుకున్నాడని వైసిపి పేర్కొంది.” ఆమె చెప్పిన వివరాల ఆధారంగా.. ఆ మహిళకు పేరెంట్స్ లేరని ఎమ్మెల్యే తెలుసుకున్నాడు. ఆమె భర్త ఐటి ఉద్యోగిగా హైదరాబాదులో పని చేస్తున్నాడని గుర్తించాడు. ఒకరోజు ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆమెను కారులో ఎక్కించుకొని తీసుకెళ్లాడు. మార్గమధ్యలో ఒక గ్రామం సమీపంలో ఆమె మీద బలాత్కారం చేయబోయాడు. ఆమె వారించినప్పటికీ.. జుట్టు పట్టుకొని కారులోనే దారుణం చేశాడు. అంతేకాదు పలుమార్లు ఆమెపై ఇలానే చేశాడు. ఆ తర్వాత భర్తకు విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. పెళ్లి చేసుకుంటానని బెదిరించాడు. దానికి ఆమె ఒప్పుకోక పోవడంతో ఇబ్బంది పెట్టాడు. ఆమె భర్తకు ఫోన్ చేసి బీభత్సం సృష్టించాడు. దీంతో ఆ మహిళకు, భర్తకు విభేదాలు ఏర్పడ్డాయి. తాను చెప్పినట్టు విడాకులు ఇవ్వకపోతే ఆ మహిళ మూడు సంవత్సరాల కుమారుడిని చంపేస్తానని హెచ్చరించాడు. పథకాలంగా శ్రీధర్ ఇలా వేధిస్తూ ఉండడంతో ఆ మహిళ తట్టుకోలేకపోయింది. చివరికి ఆ వివరాల మొత్తం బయటపెట్టింది. జనసేన ఎమ్మెల్యే ఈ స్థాయిలో అరాచకానికి పాల్పడడాన్ని చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో అర్థం చేసుకోవచ్చని” వైసీపీ సోషల్ మీడియా పేర్కొంది.


నా కొడుకు చాలా మంచోడు

జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద వచ్చిన ఆరోపణలపై ఆయన తల్లి ప్రమీల స్పందించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అయిన అరవ శ్రీధర్ వీడియో అంటూ వైసీపీ ఓ వీడియో రిలీజ్ చేసింది. ఆ తర్వాత ఆ వీడియోలో ఉంది తానేనంటూ ఓ మహిళ వీడియో రిలీజ్ చేసింది. ఈ వీడియోలో అరవ శ్రీధర్ మీద లైంగిక వేధింపులు, అత్యాచారం ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో ఈ ఆరోపణలపై అరవ శ్రీధర్ తల్లి స్పందించారు. విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మహిళ ఆరోపణలను ఖండించారు. రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద మహిళ లైంగిక ఆరోపణల వ్యవహారం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మహిళ ఆరోపణలపై ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తల్లి ప్రమీల స్పందించారు. తన కుమారుడిపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం సాయంత్రం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ ఆరోపణలను అరవ శ్రీధర్ తల్లి తీవ్రంగా ఖండించారు. ఆ మహిళ కులం పేరు చెప్పిన తన కుమారుడికి దగ్గరైందని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత ఇంటికి రావటం మొదలుపెట్టిందని.. పగలు, రాత్రీ తేడా లేకుండా ఫోన్లు కూడా చేసేదని ఆరోపించారు. అరవ శ్రీధర్‌ను పెళ్లిచేసుకోమంటూ చాలాసార్లు బ్లాక్ మెయిల్ చేసిందని ఎమ్మెల్యే శ్రీధర్ తల్లి ప్రమీల ఆరోపించారు. సాయం కోసం వచ్చి.. తన బిడ్డను అభాసుపాలు చేసిందంటూ అరవ శ్రీధర్ తల్లి ప్రమీల ఆరోపించారు. ఆడపిల్ల జీవితం నాశనం చేయకూడదనే ఉద్దేశంతో ఇప్పటి వరకూ ఓపికగా ఉన్నామని అన్నారు. మహిళ వేధింపులపై జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశామని ప్రమీల చెప్పుకొచ్చారు. .ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో ఎవరు నిజం.. ఎవరు అబద్ధమనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన ఎమ్మెల్యే అయిన అరవ శ్రీధర్ మీద ప్రభుత్వ ఉద్యోగిని అయిన ఓ వివాహిత ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఫేస్‌బుక్ ద్వారా కలిగిన పరిచయాన్ని ఆసరాగా తీసుకుని అరవ శ్రీధర్ తనను బెదిరించి.. అత్యాచారం చేశారంటూ సంచలన ఆరోపణలు చేసింది. ఆ తర్వాత గర్భం దాల్చితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి అబార్షన్ కూడా చేయించారంటూ ఆరోపించటం తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. అలాగే అరవ శ్రీధర్‌విగా చెప్తున్న వీడియోలను కూడా సోషల్ మీడియాలో వైసీపీ షేర్ చేసింది. అలాగే అరవ శ్రీధర్ మీద చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ మహిళా కమిషన్ సైతం జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం మీద స్పందించింది. ఏపీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ ఈ వ్యవహారంపై స్పందించారు. రాయపాటి శైలజ బాధితురాలితో ఫోన్ ద్వారా మాట్లాడినట్లు తెలిసింది. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# ఏపీకి కేంద్రం శుభవార్త..
# భారీగా నిధులు విడుదల

విజయవాడ, జనవరి 28(భారత శక్తి ప్రతినిధి)

నరేగా పనులకు కేంద్రం తీపికబురు చెప్పింది. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.740 కోట్లు విడుదల చేసింది. దీంతో సామగ్రి కొనుగోలుకు డబ్బులు అందుబాటులోకి వచ్చి, పనులు వేగవంతం అవుతాయి. కార్మికులకు సకాలంలో చెల్లింపులు జరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రం ఈ నిధుల విడుదల చేయడాన్ని స్వాగతించారు.ఏపీకి కేంద్రం తీపికబురు చెప్పింది.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) కింద మెటీరియల్ కాంపోనెంట్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి విడుదల చేశాయి. ఈ నిధుల విడుదలతో నరేగా పనులకు అవసరమైన సామాగ్రి కొనుగోలుకు డబ్బులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో బిల్లులు చెల్లించడంలో జాప్యం జరిగేది. ఇప్పుడు ఈ నిధులతో ఆ సమస్య తీరుతుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.480.87 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.259.13 కోట్లు కలిపి మొత్తం రూ.740 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు చేస్తారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది నాలుగో విడతలో మొదటి విడతగా ఈ నిధులను విడుదల చేశారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. కార్మికులకు సకాలంలో చెల్లింపులు జరగడానికి కూడా ఇది దోహదపడుతుంది. రాష్ట్రానికి కేంద్రం మెటీరియల్ నిధులు విడుదల చేయడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల విడుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందన్నారు.కేంద్రం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన మెటీరియల్ పనులకు ఊతమిస్తుంది. కేంద్రం విడుదల చేసిన రూ.556 కోట్లలో, నాలుగో విడతగా రూ.480 కోట్లు, గతంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.75 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తాన్ని స్పర్శ అకౌంట్ ద్వారా రాష్ట్రానికి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 25 శాతం నిధులను, అంటే



రూ.185 కోట్లను జమ చేయాల్సి ఉంటుంది. అప్పుడు మొత్తం రూ.740 కోట్లు మెటీరియల్ పనుల కోసం అందుబాటులోకి వస్తాయి. ఈ నిధులతో అక్టోబర్ వరకు పూర్తయిన మెటీరియల్ పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇది కూలీలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడటానికి సహాయపడుతుంది.'ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి కీలక ముందడుగు. 2025?26 ఆర్థిక సంవత్సరానికి గాను ఓఉ ఔఖీఇఉం పథకం కింద మెటీరియల్ భాగానికి కేంద్ర ప్రభుత్వం ?480.87 కోట్ల సహాయాన్ని మంజూరు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాల ప్రయోజనం కలిగించే పనులు వేగంగా, నిరంతరంగా చేపట్టేందుకు బలమైన మద్దతు లభించింది. ఈ నిధులు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, గ్రామస్థాయి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ అంకితభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి దూరదృష్టి నాయకత్వంలో, కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారి మార్గదర్శకత్వంలో, అలాగే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరియు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి సమర్థ అమలుతో ఈ సహాయం గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన మార్పును తీసుకురానుంది' అంటూ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ట్వీట్ చేశారు.

# తుని రైల్వేస్టేషన్‌లో కొత్త శోభ

విజయవాడ, జనవరి 28 (భారత శక్తి ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అనేక రైల్వే? స్టేషన్లలో అభివృద్ధి? పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్ కొత్త శోభను




సంతరించుకుంది. రూ.19 కోట్ల నిధులతో స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్లాట్ ఫామ్‌ల ఆధునీకరణ, వెయిటింగ్ హాళ్ల అభివృద్ధి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యాయి. ఈ ఫోటోలను రైల్వేశాఖ షేర్ చేసింది.ఏపీలోని పలు రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పథకమైన అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రాష్ట్రంలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టడంతో.. తుని రైల్వే స్టేషన్ కొత్త రూపు సంతరించుకుంది. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద తుని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు అభివృద్ధి చేశారు. అలాగే కొత్తగా మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ప్రయాణికులు నిరీక్షించేందుకు నిర్మించిన వెయిటింగ్ హాళ్లను ఆధునిక టాయిలెట్లతో అప్ గ్రేడ్ చేశారు. తుని రైల్వే స్టేషన్ ముఖద్వారంతో పాటుగా స్టేషన్ ప్రాంగణాన్ని రీ డిజైన్ చేశారు. దీంతో తుని రైల్వే స్టేషన్ రూపురేఖలే మారిపోయాయని రైల్వే ప్రయాణికులు చెప్తున్నారు. అభివృద్ధి చేసిన రైల్వే స్టేషన్ ఫోటోలను భారతీయ రైల్వే ఎక్స్ వేదికగా పంచుకుంది.మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఏపీలోని 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2,051 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తుని రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఈ పథకం కింద రూ.19.13 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ నిధులతో కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, స్టేషన్ ఎంట్రీ రీ డిజైన్, రైల్వే స్టేషన్ ఆవరణలో పనులు చేపట్టారు. తుని రైల్వే స్టేషన్‌లోని ఒకటీ, రెండు ప్లాట్‌ఫామ్‌లను కలుపుతూ కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ప్రధాన ద్వారం నుంచి కాకుండా బయటి వ్యక్తులు రైల్వే స్టేషన్‌లోకి రాకుండా కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారు. పనులు దాదాపుగా పూర్తికావటంతో స్టేషన్ కొత్త శోభను సంతరించుకుంది. మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లలో కొత్త భవనాల నిర్మాణంతో పాటుగా ప్రయాణికులకు వీలుగా ఉండేందుకు లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తారు. రైల్వే స్టేషన్ వచ్చే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఫుడ్ కోర్టులు, షాపింగ్ కాంప్లెక్సులు, టాయిలెట్లు, వెయిటింగ్ హాళ్ల నిర్మాణం చేపడుతారు. అలాగే లగేజీ భద్రపరుచుకునే గదులు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తారు. డిజిటల్ బోర్డులు, సీసీ కెమెరాలు, వైఫై సౌకర్యం వంటి ఏర్పాట్లు చేస్తారు. ఈ క్రమంలోనే ఈ పథకం కింద ఏపీలోని ప్రధాన రైల్వే స్టేషన్లను కేంద్రం అభివృద్ధి చేస్తోంది.మరోవైపు తుని రైల్వే స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్, ఎల్టీటీ, ఏపీ ఎక్స్ ప్రెస్ వంటి రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే హాల్ట్ కల్పించింది. ఇటీవలే ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి నెల నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాకినాడ, కోనసీమ ప్రాంత వాసులకు ఉపయోగం ఉంటుంది.

# అమరావతికి బాలయ్య దూరం

అనంతపురం, జనవరి 28 (భారత శక్తి ప్రతినిధి)

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కొంత ఏపీ రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు కనపడుతుంది. ఆయన హిందూపురం నియోజకవర్గానికే పరిమితమవుతున్నారు. ఆయన త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు వస్తారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నందమూరి బాలకృష్ణ ఉన్నది ఉన్నట్లు మాట్లాడతారు. ఏదీ మనసులో ఉంచుకోరు. అది శాసనసభ అయినా.. బహిరంగ సభ అయినా ఆయనకు ఒక్కటే. తాను అనుకున్నది బయటకు చెప్పేయడమే బాలకృష్ణకు అలవాటు. అదే అనేక సార్లు రాజకీయంగా పార్టీకి ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. గత నవంబర్ లో జరిగిన శాసనసభ సమావేశాల్లో నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు కూటమిలోని పార్టీలను షేక్ చేశాయి.శాసనసభలో చిరంజీవిని ప్రస్తావన తెచ్చి టీడీపీ నాయకత్వానికి ఇబ్బందిగా మారారు. . ఇక అదే సమయంలో దీనిపై ఎవరు ఎంత రచ్చ చేసినా ఆయన నోటి నుంచి ఎటువంటి క్షమాపణ అన్న పదం రాలేదు. అందుకే నాడు చంద్రబాబు నాయుడు స్వయంగా పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లి మాట్లాడాల్సి వచ్చింది. ఇక ఆ వివాదం సద్దుమణిగిన తర్వాత నందమూరి బాలకృష్ణ ఏపీ రాజకీయాల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. అసలు విజయవాడ కు రావడమే మానేశారు. తనకు ఏదైనా పనులు ఉన్నా హిందూపురం నియోజకవర్గంలో సమస్యలున్నా నేరుగా చంద్రబాబుకో, లోకేశ్ కో ఫోన్ చేసి పరిష్కరించుకుంటున్నారు కానీ అమరావతిలో మాత్రం అడుగు పెట్టలేదు.ఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లో ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వచ్చిన నందమూరి బాలకృష్ణ నివాళులర్పించి కేవలం ఎన్టీఆర్ గురించి నాలుగు మంచి మాటలు మీడియాతో మాట్లాడారు. అంతకు మించి రాజకీయాల జోలికి ఆయన వెళ్లలేదు. ప్రతిసారీ అక్కడ కూడా రాజకీయాలు మాట్లాడే నందమూరి బాలకృష్ణ ఈసారి మాత్రం



ఆ పనిచేయకపోవడంపై అందరిలోనూ చర్చ మొదలయింది. నందమూరి బాలకృష్ణను పార్టీ నాయకత్వం దూరంగా ఉండాలని చెప్పిందని అనుకోలేం. ఎందుకంటే బాలకృష్ణను అలా నియంత్రించలేరు. కానీ నందమూరి బాలకృష్ణ మాత్రం మౌనంగా ఉండటం వెనక ఏదో ఒకటి జరిగి ఉంటుందన్న ప్రచారం బాలయ్య బాబు ఫ్యాన్స్ లో అనుమానం కలుగుతుంది. ఇంతకీ లెజెండ్ సైలెన్స్ వెనక సినిమా షూటింగ్ లే కారణమా? లేక తన మాట కూటమి ప్రభుత్వంలో చెల్లుబాటు కావడం లేదన్న అసహనమా? అన్న చర్చ జరుగుతుంది.

# తీర ప్రాంతాలకు కోత

కాకినాడ, జనవరి 28 (భారత శక్తి ప్రతినిధి)

ఏపీలోసుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి తిరుపతి జిల్లా తడ వరకు దాదాపు 1000 కిలోమీటర్ల పొడవునా తీరం ఉంది. అయితే ఎక్కడికక్కడే తీరం కోతకు గురవుతోంది. తీర ప్రాంత ప్రజలకు సముద్రపు కోత కన్నీటిని మిగిల్చుతోంది. ఈ నేపథ్యంలో తీర ప్రాంతం కడలి కోతకు గురికాకుండా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తీర ప్రాంత కోతకు అడ్డుకట్ట వేయడానికి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండల పరిధిలో ప్రయోగాత్మకంగా జియో ట్యూబు సాంకేతికతతో రక్షణ కూడా నిర్మిస్తోంది. తీరం కోతకు గురి కావడంతో తరచూ విపత్తులు సంభవించి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అందుకే కట్టిన చర్యలకు ఉపక్రమిస్తోంది ప్రభుత్వం.సముద్ర కోతను అరికట్టడానికి ల్యాండ్ రిక్లమేషన్, నీటి నిర్వహణలో ఈ జియో ట్యూబ్ టెక్నాలజీని ఉపయోగిస్తారు. ముఖ్యంగా సముద్రపు కోతకు అడ్డుకట్ట వేయడానికి.. 6 స్టేజీల్లో జియో ట్యూబ్ రక్షణ గోడ నిర్మాణం చేపడతారు.. ముందుగా జియో టెక్స్టైల్ ఫ్యాబ్రిక్ తో తయారు చేసిన ట్యూబుల్లో ఇసుక నింపుతారు. వాటిని నిర్దేశించిన పొడవులో తీర ప్రాంతంలో గోడలా అమర్చుతున్నారు. ఈ జియో ట్యూబుకు ఇరువైపులా పాలి ప్రొపైలీన్ జియో సింథటిక్ కార్డుతో చేసిన గాబియన్ బాక్సులు అమర్చుతారు. ఈ బాక్సుల్లో గ్రానైట్ రాళ్ళను నింపి.. వాటి మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో ఇసుక పోస్తారు. అలల ఉధృతి, అక్కడి నేల స్వభావాన్ని అంచనా వేసి ఈ జియో ట్యూబ్ రక్షణ గోడను నిర్మిస్తున్నారు. సంప్రదాయ పద్ధతులు కంటే ఇది సులభమైనదిగా భావిస్తున్నారు. తక్కువ ఖర్చుతో పూర్తవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ఈ టెక్నాలజీ తమిళనాడుతో పాటు ఒడిస్సాలో వినియోగించినట్లు తెలుస్తోంది.తీరంలో.. ప్రధానంగా పశ్చిమగోదావరి పెద్ద మైనవానిలంక ప్రాంతంలో కోతకు గురవుతోంది. ఆ ప్రాంతంలో కోట్ల రూపాయల విలువైన సర్వి, కొబ్బరి తోటలు సముద్రంలో కలిసిపోతున్నాయి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు 2022లో కేంద్ర ప్రభుత్వం రక్షణ గోడ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలోనే డెలైట్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల్లో భాగంగా రూ.13.50 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. మద్రాస్ ఐఐటీ నిపుణులు డిజైన్స్, సూచనలు ఆధారంగా 2025 మేలో పనులు ప్రారంభం అయ్యాయి. పూనే కు చెందిన గార్వారి కంపెనీలు రక్షణ గోడ నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే నెలలో 70 శాతానికి పైగా పనులు పూర్తవుతాయని తెలుస్తోంది. మిగిలిన చోట్ల కూడా ఈ రక్షణ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు సమాచారం.

# వినుకొండలో మైనర్ బాలికపై అత్యాచారం..
# ఫిర్యాదు చేశారనే కక్షతో కుటుంబంపై దాడి

వినుకొండ జనవరి 28 (భారత శక్తి ప్రతినిధి)

పల్నాడు జిల్లా వినుకొండలో మైనర్ బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారనే కక్షతో నిందితుడు బాలిక కుటుంబ సభ్యులపై విచక్షణా రహితంగా దాడి చేయడం మరో దారుణంగా మారింది.

అత్యాచారానికి పాల్పడ్డ బాజీవలి, అతని బంధువులతో కలిసి బాలిక కుటుంబంపై దాడి చేసి, ఇంట్లోని ఫర్నిచర్ను ధ్వంసం చేశాడు. బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ అఘాయిత్యానికి ఆగ్రహించిన స్థానికులు నిందితుడు బాజీవలిని పట్టుకుని దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## కబ్జాపై హైడ్రా అధికారులు కొరడా

మేడ్చల్ మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం కాచవని సింగారం దివ్యానగర్ లోని ఓ లేఔట్ రోడ్ కబ్జాపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపించారు. కాచివాని సింగారం సర్వే నెంబర్ 43 పార్ట్, 44, 55, 56, 57, 58, 59 లలో 1991 లో ఏర్పాటు చేసిన లేఔట్ లో 40 ఫీట్స్ రోడ్ ను చూపించారు.

మలిపెద్ది హనుమంత్ రెడ్డి అనే వ్యక్తి 40ఫీట్ల రోడ్డులో 12 ఫీట్ల రోడ్డు కబ్జా చేసి కాంపౌండ్ వాల్ పెట్టుకున్నారని ఆరోపిస్తూ కాలనీ వాసులు హైడ్రా అధికారులకు పిర్యాదు చేసారు. హైడ్రా అధికారులు లేఔట్ క్షుణ్ణంగా పరిశీలించి, రోడ్ కబ్జా కు గురైన రోడ్డు కాంపౌండ్ వాల్ కూల్చివేసారు. కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ, కబ్జా నుండి కాపాడిన హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జగన్‌లో ఎంత మార్పో

విజయవాడ, జనవరి 28(భారత శక్తి ప్రతినిధి)

గత ఎన్నికలలో తెచ్చిన ఓటమి వైసీపీ అధినేత జగన్ లో మార్పు తెచ్చినట్లు కనపడుతుంది. వైసీపీ అధికారంలోకి రాకముందు, తర్వాత కూడా జగన్ ను నేరుగా కార్యకర్తలను కలిసే అవకాశముండేది కాదు. ఏదైనా జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు మాత్రమే అదీ వాహనంలో ఉండి పలకరింపులు తప్పించి జగన్ ను ముఖ్య కార్యకర్తలు నేరుగా కలిసే అవకాశముండేది కాదు. ఇక 2019 నుంచి 2024 వరకూ అధికారంలో ఉన్న సమయంలో జగన్ నేతలను, ఎమ్మెల్యేలను, మంత్రులను కూడా కలిసేవారు కాదు. ఆయన చుట్టూ ఉన్న కోటరీ నేతలను కలవనివ్వకుండా చేసేదని సాక్షాత్తూ విజయసాయిరెడ్డి లాంటి నేతలే బయటకు వచ్చిన తర్వాత ఆరోపణలు చేశారు.అయితే జగన్ ఓటమి తర్వాత కొంత మార్పు వచ్చినట్లు కనపడుతుంది. ఇప్పుడు జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి ఎప్పుడు వచ్చిన నేతలతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలకు కూడా ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నారు. వారితో ముచ్చటిస్తున్నారు. కార్యకర్తలతో ఫొటోలు దిగుతున్నారు. ఓటమి తర్వాత ఇప్పటికే బెంగళూరుకు మకాం మార్చిన జగన్ నెలలో రెండు సార్లు తాడేపల్లికి వస్తారు. ఆయన వస్తారని రాష్ట్రం నలుమూలల నుంచివచ్చిన వారిని నిరాశపర్చకుండా జగన్ వారితో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. వారి వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకుంటున్నారు. దీంతో క్యాడర్ లో భరోసా నింపే అవకాశముంటుందని ఆయన భావించి కార్యకర్తలకు కలుసుకునే అవకాశం కల్పించారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత వరసగా కార్యకర్తలపై కేసులు నమోదవుతుండటం, ఇక ఎన్నికలకు



మూడేళ్లు మాత్రమే సమయం ఉండటంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరుగుతుండటంతో కార్యకర్తలు ఖచ్చితంగా పార్టీ విజయానికి దోహదపడతారని ఆయన గుర్తించినట్లుంది. అందుకే గత కొన్నేళ్లుగా దూరం పెట్టిన కార్యకర్తల భుజం పైన చేతులు వేసి మరీ ఫొటోలు దిగుతున్నారంటే ఖచ్చితంగా జగన్ లో మార్పు వచ్చిందంటున్నారు. ఇక నేతలయితే ఎలాంటి అపాయింట్ మెంట్ లేకపోయినా అప్పటికప్పుడు కలవాలన్నావెళ్లి కలిసే వీలు కల్పించారు. దీంతో క్యాడర్ నుంచి లీడర్ల వరకూ జగన్ లో వచ్చిన మార్పును చూసి ఆశ్చర్యపోతున్నారట. ఇదే పరిస్థితి భవిష్యత్ లోనూ కొనసాగాలని కోరుకుంటున్నారు.

# బెంగాల్ పై కమలం గురి

న్యూఢిల్లీ, జనవరి 28, (భారత శక్తి ప్రతినిధి)

2026లో జరిగే ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో బీజేపీకి అత్యంత కీలకమైన రాష్ట్రం పశ్చిమ బెంగాల్. 2021లో బీజేపీ కేవలం 76 సీట్ల వద్దనే ఆగిపోయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ తీవ్రంగా పోరాడింది. సీఎం మమతా బెనర్జీని ఓడించింది. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సీట్లు సాధించలేదు. 15 ఏళ్లుగా బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉంది. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ముస్లిం ఓటర్లకు అండగా ఉంటూ హిందువులకు దూరంగా ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఇదే మంచి అవకాశంగా భావిస్తోంది. జేపీ నడ్డా నేతృత్వంలో రాష్ట్ర వ్యూహం రూపొందించారు. ఈ క్రమంలో జేపీ.నడ్డా బెంగాల్ కీలక సమావేశం నిర్వహించారు. విభేదాలు తొలగించే ప్రయత్నం చేశారు. కీలక బాధ్యలు అప్పగించారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక ఎంపీ లేదా సీనియర్ నాయకుడిని నియమించింది. బీజేపీ అధికారంలోకి వస్తే ఆయుష్మాన్ భారత్, జీ రామ్‌జీ అమలవుతాయి. ఈ అంశాన్ని బెంగాల్ ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఒక ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నడ్డా మార్గదర్శకత్వంలో వచ్చిన మరో కీలకం స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూలో బీజేపీ ఓట్లు తొలగకుండా చూశారు. నవంబర్ 24న బీజేపీ మొత్తం రాష్ట్రాన్ని ఐదు కీలక జోన్లుగా విభజించింది. ప్రతీ జోన్‌కు ఒక సంఘటన కార్యదర్శిని నియమించింది. వీరు స్థానిక నాయకులను కలుపుకుని విస్తృతంగా తిరుగుతూ పనిచేస్తున్నారు. ఢిల్లీ ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన పవన్ రాణాకు బెంగాల్‌లో కీలక బాధ్యతలు అప్పగించారు.ప్రతీ నియోజకవర్గానికి ఎంపీ లేదా సీనియర్ నాయకుడిని నియమించారు. రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా చేసి, ప్రతి జోన్‌కు సంఘటన కార్యదర్శి నియమించారు. ఢిల్లీ ఎన్నికల హీరో పవన్ రాణాను బెంగాల్‌లో బాధ్యతలు ఇచ్చారు. కోల్‌కతా, దక్షిణ బెంగాల్ (24 పర్గణాలు)లో సీట్లు పెంచాలని లక్ష్యం. 15 ఏళ్ల అధికారంలో మమతా ప్రభుత్వం ముస్లిం ఓట్లపై ఆధారపడి హిందువులను కంగోరు చేసిందని ఆరోపణ. విలేజ్ వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఓటర్లను ఆకర్షిస్తోంది. 2021లో బీజేపీ 76 సీట్లకు ఆగినా, ప్రభుత్వ ఏర్పాటు కలిగలేదు.ముఖ్యంగా బీజేపీ దృష్టి కోల్‌కతా, దక్షిణ బెంగాల్‌పై ఎక్కువగా ఉంది. నార్త్, సౌత్ 24 పరగణాల్లో 64 సీట్లు ఉంటాయి. 2016లో బీజేఈ కేవలం ఒక సీటు, 2021 ఐదు సీట్లు



గెలిచింది. ఇక్కడ సీట్లు పెంచాలని బీజేపీ భావిస్తోంది. కోల్‌కతా మెట్రోపాలిటన్ ఏరియాల్లో 2016, 2021లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదు. ఈ ఏరియాను కూడా ప్రత్యేకంగా పనిచేస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ కూడా ఓటర్లను ఆకట్టుకునేందుకు విలేజ్ వలంటీర్ వ్యవస్థను అమలు చేస్తోంది. వెల్ఫేర్ కమిటీ పేరుతో వెయ్యి మందిని నియమించింది. దానిని అధిగమించి బీజేపీ అధికారంలోకి రావాలని భావిస్తోంది. ఇక కేరళ, తమిళనాడులో బీజేపీకి బాగా టఫ్ పోటీ ఉంటుంది. అస్సోం, పుదుచ్చేరీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. మళ్లీ గెలిచే అవకాశం ఉంది. అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్న ఏకైక రాష్ట్రం పశ్చిమబెంగాల్. అందుకే ఫలితాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తోంది.ప్రజల అసంతృప్తి, విభేదాలు తొలగించిన నడ్డా వ్యూహం బీజేపీకి అనుకూలం. 24 పర్గణాలు, కోల్‌కతాలో సీట్లు పెరిగితే అధికార మార్పు సాధ్యమే. తృణమూల్ వెల్ఫేర్ ప్లాన్లు సవాలు, కానీ బీజేపీ కేంద్ర పథకాల ప్రచారంతో ఆధిపత్యం స్థాపించవచ్చు. ఇది 2026 ఎన్నికల్లో బీజేపీకి కీలక విజయానికి దారితీస్తుంది.

## వృద్ధాశ్రమంలో పెళ్లి రోజు వేడుకలు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన జిల్లా ఎస్పీ దంపతులు

మచిలీపట్నం (భారత శక్తి ప్రతినిధి)

ఆర్భాటాలు, హంగులకు దూరంగా ఒంటరితనంతో జీవితం గడుపుతున్న వృద్ధుల మధ్య జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు,దంపతులు మచిలీపట్నం స్నేహాలయ వృద్ధాశ్రమం నందు తమ పెళ్లి రోజు జరుపుకోవడం జరిగింది.వృద్ధాశ్రమంలో నివసిస్తున్న నిరాశ్రయ వృద్ధులకు కావలసిన నిత్యావసర వస్తువులు, ఇతర సౌకర్యాలు సమకూర్చడంతో పాటు మిఠాయిలు, పండ్లు అందజేశారు. అంతేకాకుండా వారి చేతులు పట్టుకుని, వారి కష్టసుఖాలు వింటూ, కుటుంబ సభ్యుల్లా వారితో సమయం గడిపారు.ఈ సందర్భంగా ఎస్పీ దంపతులు మాట్లాడుతూ?"హంగులు, ఆర్భాటాల మధ్య వేడుకల కంటే? మన కోసం ఎదురు చూస్తున్న ఈ వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు చూడటం మా జీవితంలో మర్చిపోలేని అనుభూతి. వారి ఆశీర్వాదాలే మా వివాహ దినోత్సవానికి నిజమైన కానుక," అని భావోద్వేగంగా తెలిపారు.వృద్ధుల కళ్లల్లో కనిపించిన ఆనందం, తడిసిన కన్నీళ్లు, చిరునవ్వులతో మెరిసిన ముఖాలు? ఈ వివాహ దినోత్సవాన్ని ఒక వేడుకగా కాకుండా, ఒక మానవీయ సందేశంగా మార్చాయని తెలిపారు.

## సహజ వనరులను కూటమి నేతలు అడ్డగోలుగా దోచేస్తున్నారు :

వర్ధన్ రెడ్డి (భారత శక్తి ప్రతినిధి)

నెల్లూరు రాష్ట్రంలో అధికార పార్టీ నేతల అవినీతి దాహానికి సహజ వనరులు దోపిడికి గురవుతున్నాయని వైసిపి నేత మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. ఇసుకను కూటమి ఎమ్మెల్యేలు అడ్డగోలుగా తవ్వుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి అడ్డగోలుగా అవినీతికి పాల్పడుతున్నాడు. ప్రభుత్వ నిర్ణయించిన రేటు కంటే ఐదు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. తిరువూరు ఇసుక రీచ్ లో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు అన్నారు. ఓపెన్ రీచ్ లలో రాత్రి సమయంలో భారీ యంత్రాలతో ఇసుకను తవ్వేస్తున్నారు. ఒక టిప్పర్ ధర 8 వేల నుండి 15000 వసూలు చేస్తున్నారు. రోజుకు 15 లక్షలు టిడిపి నేతలు జేబులో వేసుకుంటున్నారు. ఆత్మకూరు కోవూరు సర్వేపల్లి నియోజకవర్గం రీచులలో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారు. సహజ వనరులు దోచుకునే వారిని మా ప్రభుత్వం రాగానే రోడ్డుమీద నడిపిస్తాం అని ఆయన హెచ్చరించారు.

## అంగరంగ వైభవంగా ఏలూరులో అమ్మవార్ల కొర్ల బండి ఊరేగింపు జాతరకు పెద్ద ఎత్తున పోటెత్తిన భక్తులు

ఏలూరు ఏలూరులో ఐదు ప్రాంతాలలో నిర్వహిస్తున్న జాతర మహోత్సవం ముగింపు ఘట్టం కొర్రలు బండి ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. నగరంలో దక్షిణపు వీధి, తూర్పు వీధి, పవర్ పేట, ఆదివారం పేట లక్ష్మి వారపు పేట ప్రాంతాల్లో జాతర మహోత్సవ సందర్భంగా శ్రీ గంగానమ్మ అమ్మవారిని కొర్రలు బండిపై సాగనంపే కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. కొర్ల బండి పై అమ్మవారి వేషధారణలో ఉన్న పంబల పూజారి ఆశీస్సులు తీసుకోవడం కోసం భక్తులు భారీగా పోటీ పడ్డారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్లు సీసీ కెమెరా సహాయంతో నిఘా పెట్టి పర్యవేక్షించారు. 15 కిలో మీటర్లు పొడవునా అమ్మవార్లు ఉత్సవ ఊరేగింపులో మేళ తాళాలతోనూ చిత్ర విచిత్ర వేషధాలతోనూ బాణా సంచాలతో.. డిజె సౌండ్ లతో తీన్మార్లు వాయిద్యాలతో అమ్మవారిని ఘనంగా సాగనంపే కార్యక్రమాన్ని కనులు పండుగ నిర్వహించారు. ఈ విధంగా అర్ధరాత్రి వరకు అమ్మవారిని ఘనంగా సాగనంపుతూ ఊరు పొలిమేర్లలో కొర్ల బండి విడిచిపెట్టారు. అక్కడితో జాతర మహోత్సవం ముగిసింది.

## కాంట్రావర్శీకి కేరాఫ్ అడ్రస్ గా మారుతున్న చిన్మయి...

హైదరాబాద్, జనవరి 28, (భారత శక్తి ప్రతినిధి)

సినిమా ఇండస్ట్రీలో మన పని మనం చేసుకుంటూ ముందుకు సాగితే అందరికి మంచిది. అలా కాదని ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతూ మనకు అవసరం ఉన్నా లేకపోయినా ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకొని వాళ్ళు చేసే కామెంట్స్ కి రియాక్ట్ అవ్వడం వల్ల ప్రేక్షకుల దృష్టిలో బ్యాడ్ నేమ్ ని మూట కట్టుకొనే అవకాశం ఉంది. ఇండస్ట్రీ లో ఎలాంటి కాంట్రవర్సీ లేనివారికే అవకాశాలు వస్తాయి. ఇక సింగర్ చిన్మయి విషయానికి వస్తే సినిమా ఇండస్ట్రీ గురించి గాని, లేడీస్ కి సంబంధించిన విషయాల్లో గాని ఆమె చాలా తొందరగా రియాక్ట్ అవుతుంది. ఇక రీసెంట్ గా శివాజీ హీరోయిన్స్ డ్రస్సుల గురించి మాట్లాడినప్పుడు ఆమె పలు రకాల కామెంట్లు చేసింది. ఆమె మీద పలు విమర్శలు రావడంతో కామ్ అయిపోయింది. ప్రస్తుతం చిరంజీవి సైతం రీసెంట్ గా ఒక ఈవెంట్లో ఇండస్ట్రీ అందరిని ఆదరిస్తుంది. ఓన్ టాలెంట్ ని ప్రదర్శిస్తూ ముందుకు సాగాలి, కాస్టింగ్ కౌచ్ లు ఉండవు. మనం మన లక్ష్యం మీద ఫోకస్ పెట్టి ముందుకు సాగితే మనల్ని ఎవరూ ఆపలేరు అంటూ ఆయన కామెంట్స్ చేశారు.దానికి చిన్మయి కౌంటర్ ఇస్తూ ఇండస్ట్రీలో చాలామంది కాస్టింగ్ కౌచ్ ను ఎదుర్కొంటున్నారు. ప్రతి ఒక్క అమ్మాయికి అవకాశం రావాలంటే కాస్టింగ్ కౌచ్ పేరుతో చాలా రకాలుగా వాళ్లను వేధిస్తున్నారు అంటూ ఆమె కౌంటర్ అయితే ఇచ్చింది. దీని మీద నెటిజన్లు సైతం విమర్శలు చేస్తున్నారు.చిరంజీవి మాట్లాడింది ఏమిటి నువ్వు చెప్పిన సమాధానం ఏంటి నీ సంకల్పం గట్టిదైతే నువ్వు టాప్ లెవెల్ కి వెళ్ళిపోతావు. అంటూ చిరంజీవి చెబితే నువ్వు మాత్రం ఎంత టాలెంట్ ఉన్నా కాస్టింగ్ కౌచ్ లు ఎదుర్కోక తప్పదు అంటూ మాట్లాడడం సరైనది కాదు అంటూ కామెంట్స్ చేస్తున్నారు.అయిన అవసరం ఉన్నా లేకున్నా ప్రతి విషయంలో నువ్వు తల ఎందుకు తలదురుస్తున్నావ్ అంటు చిన్మాయి ని సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు?ఇక ఇప్పటికైనా చిన్మయి తన వైఖరిని మార్చుకొని ముందుకు సాగితే మంచిది. లేకపోతే ఆమెకు ఇండస్ట్రీలో అవకాశాలు వచ్చే ఛాన్సులైతే లేవు

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

మేడ్చల్ (భారత శక్తి ప్రతినిధి)

మేడిపల్లి పీఎస్ పరిధిలో అర్ధరాత్రి అతివేగంగా వచ్చి నడుపుతూ పిల్లర్ నెంబర్ 97 ను కారు ఢీ కొంది. ప్రమాద సమయంలో కారులో 8 మంది విద్యార్థులు వున్నారు. ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. వీరంతా వనపర్తి జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులుగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## రోజుకో మలుపు తిరుగుతున్న స్వామిజీ, యోగి వివాదం

లక్నో, జనవరి 28, (భారత శక్తి ప్రతినిధి)

ఉత్తర్ ప్రదేశ్‌లో శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద, సీఎం యోగి ఆదిత్యనాథ్ మధ్య వివాదం ముదురుతోంది. మౌని అమావాస్య రోజున ప్రయాగ్‌రాజ్ మాఘ మేళాకు వచ్చిన స్వామిజీని అధికారులు అడ్డుకోవడం, పవిత్ర స్నానం చేయలేకపోవడం ఘర్షణకు దారితీసింది. సీఎం వ్యాఖ్యలకు స్వామిజీ కౌంటర్ ఇవ్వగా, యూజీసీ నిబంధనలపై కూడా స్వామిజీ స్పందించారు. ఈ నేపథ్యంలో, సీఎం యోగి, ప్రధానికి మద్దతుగా ఒక అధికారి రాజీనామా చేయడం ఈ వివాదం మరో మలుపు తిరిగింది. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతికి మధ్య జరుగుతున్న వివాదం రోజు రోజుకూ తీవ్రమవుతోంది. తాజాగా, అయోధ్యకు చెందిన ఒక సీనియర్ అధికారి.. సీఎం యోగి, ప్రధానమంత్రి, రాజ్యాంగానికి మద్దతుగా తాను రాజీనామా చేస్తున్నానని చెబుతూ తన పదవికి రాజీనామా చేశారు. ప్రయాగ్‌రాజ్ మాఘ మేళాకు తన అనుచరులతో త్రివేణి సంగమానికి వచ్చిన స్వామి అవిముక్తేశ్వరానందను అధికారులు అడ్డుకుని, రథం దిగి నడుచుకుంటూ వెళ్లాలని అభ్యంతరం చెప్పిన సంగతి తెలిసిందే. ఇది చిలికి చిలికి గాలివానలా మారినట్టు పోలీసులు సాధువుల మధ్య తోపులాటకు దారితీసింది. ఆ సందర్భంగా రథాన్ని సంగమానికి దూరంగా తీసుకెళ్లడంతో శంకరాచార్య పవిత్ర స్నానం చేయలేకపోయారుదీనిని తనకు జరిగిన అవమానంగా పేర్కొంటూ.. స్వామిజీ అక్కడే తన శిష్యులు, అనుచరులతో కలిసి నిరసనకు దిగారు. ఇది శంకరాచార్య, సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. శంకరాచార్య పేరు ప్రస్తావించకుండానే రామాయణంలో హనుమంతుడిని మోసం చేయడానికి సాధువు వేషం వేసుకున్న 'కాలనేమి' అనే రాక్షసుడిని ఉద్దేశిస్తూ అలాంటి వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. దీనికి కౌంటర్ ఇచ్చిన శంకరాచార్య.. యోగి ప్రస్తుతం రాజకీయ నాయకుడని, తనలాంటి సాధువుల మాదిరిగా మతపరమైన అంశాలకు జోలికి రావద్దని హెచ్చరించారు''రాజకీయ నాయకుడు అయిన ముఖ్యమంత్రి విద్య, ఆరోగ్యం, శాంతిభద్రతలు లేదా రాష్ట్ర శ్రేయస్సు గురించి మాట్లాడటం లేదు. ఆయన కాలనేమి గురించి, మతం, నాస్తికత్వం గురించి మాట్లాడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం? ముఖ్యమంత్రి తన రాష్ట్ర శ్రేయస్సు గురించి చర్చించాలి. మతానికి సంబంధించిన విషయాన్ని మత పెద్దలకే వదిలివేయాలి' అని ఆయన అన్నారు.అలాగే, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీలు, హెల్ప్‌లైన్‌లు, పర్యవేక్షణ బృందాలు ఏర్పాటుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నోటిఫై చేసిన కొత్త నిబంధనల వివాదం జోలికి కూడా శంకరాచార్య వెళ్లారు.ప్రభుత్వ నిబంధనలను జనరల్ కేటగిరీ విద్యార్థులు, పలువురు రాజకీయ నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనిపై స్వామిజీ మాట్లాడుతూ'ఏ కులం కూడా సహజంగా అన్యాయం చేయదు.. అన్యాయంగా వ్యవహరించేది వ్యక్తులే. ప్రతి కులంలో మంచి, చెడు రెండు రకాల వ్యక్తులు ఉంటారు. ఒక వ్యక్తి అన్యాయం చేయవచ్చు, కానీ మొత్తంగా ఏ కులాన్ని న్యాయంగా లేదా అన్యాయంగా ముద్ర వేయకూడదు. ఒక కులాన్ని మరొక కులానికి వ్యతిరేకంగా నిలబెట్టడం ద్వారా, మీరు తప్పుదారిలో వెళ్తున్నారు.. ఇది హిందూ మతానికి చాలా హాని కలిగించవచ్చు. కాబట్టి, ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు.

ఈ క్రమంలో మంగళవారం రాజీనామా చేసిన అయోధ్య డిప్యూటీ జీఎస్టీ కమిషనర్ ప్రశాంత్ కుమార్ సింగ్.. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ , ప్రధాని మోదీ, ఇతరులకు జరిగిన అవమానాన్ని తాను సహించలేనని ఆయన పేర్కొన్నారు. 'ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి, హోంమంత్రికి, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి మద్దతుగా, ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనలకు అనుగుణంగా నేను రాజీనామా చేశాను. సమాజాన్ని విభజించే లక్ష్యంతో అవిముక్తేశ్వరానంద చేసిన అడ్డగోలు వ్యాఖ్యలు నాకు బాధ కలిగించాయి' అని సింగ్ అన్నారు.ముఖ్యమంత్రిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. 'ఈ ప్రభుత్వానికి నేను రుణపడి ఉన్నాను.. రోబోలా కేవలం జీతం తీసుకోవడం నా విధి కాదు. యోగి ఆదిత్యనాథ్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి, ఈ అవమానాన్ని నేను సహించలేను' అని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ వ్యాఖ్యానించారు. యూజీసీ అంశంపై రాజకీయాలు చేయడం తనను బాధించిందని, రాజీనామా ఆమోదం తర్వాత సామాజిక సేవను మొదలుపెడతానని తెలిపారు.

## పట్టు కోసం గులాబీ ఎత్తులు

అదిలాబాద్, జనవరి 28, (భారత శక్తి ప్రతినిధి)

'పోగొట్టుకున్న చోటనే వెతుక్కోవాలన్నట్టు' గులాబీపార్టీ పుర ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది. చేజారిన పురపాలన పగ్గాలను తిరిగి సాధించుకోవ డం కోసం మాస్టర్ ప్లాన్‌తో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ రంగంలోకి దూకుతుంది. మున్సిపాలి టీలోని 34 వార్డుల్లో బలమైనా, ప్రజల్ని ప్రభావితం చేసే యువకులను అభ్యర్థులుగా పోటీ లోకి దింపనున్నట్లు సమాచారం. 2023 శాసనసభ ఎన్నికల్లో పరాభవానికి గురైన బీఆర్ఎస్ స్థానిక ఎన్నికలను పూర్వవైభవం తెచ్చుకోవడానికి ప్రతిష్టాత్మకంగా భావి స్తున్నదనీ విశ్లేషకులు అంటున్నారు. స్థానిక ఎన్నికలు సర్పంచ్, వార్డ్ మెంబర్ల ఎన్నికల అంకంతో స్థానిక పోరు మొదలైంది. దాని కొనసాగింపుగా.. మరో స్థానిక ఎన్నికలు రానే వచ్చాయి. పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సాధించిన ఫలితాలు, అధికార పార్టీకి ఇచ్చిన గట్టిపోటీ రాజకీయ భవిష్యత్తుకు ఆశాజనకంగా గులాబీ శ్రేణులు భావిస్తున్నారు. మున్సి పల్ ఎన్నికల్లో మరింత దూకుడు పెంచే అవకాశం ఉంది. అందుకోసం వ్యూహ ప్రతి వ్యూహాల్లోనూ.. బీఆర్ఎస్ బిజీగా ఉంది. బలమైన గెలుపు గుర్రాలు అందుకు ప్రధాన ఆయుధాలుగా ఎంచుకుంటున్నది.కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ పనితీరు పట్ల సహజంగానే కొంత అసంతృప్తులు, అసమ్మతులు, విమర్శలను మూటకట్టుకున్నారని కాంగ్రెస్ శ్రేణుల్లోనే అభిప్రాయాలున్నాయి. స్థానికంగా ఎమ్మెల్యే ఉండకపోవడం, అతని పీఏల పనితీరుకు తోడు కాంగ్రెసులోని సీనియర్లను పట్టించుకోవడం లేదని అసంతృప్తులు ఆయనను విమర్శలకు గురిచేశాయి. ఈ గ్యాప్‌ను కూడా ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఎన్నికల్లో పై చేయి సాధించటానికి ప్రయత్నిస్తోంది. అయితే అది అంత సులువుగా జరిగే పని కాద నీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంతకాలంగా బీఆర్ఎస్ ప్రేక్షక పాత్రలో ఉండ టం కూడా కొంత మైనస్‌గా ఆ పార్టీకి లేకపోలేదు. మారిన రిజర్వేషన్ల నేపథ్యంలో బెల్లంపల్లి మున్సిపాలిటీలో కొత్త అభ్యర్థులే అన్ని పార్టీలకు దిక్కయ్యారు. ప్రధాన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జనరంజకమైన, సమర్థవంతమైన అభ్యర్థుల వేటలో ఉన్నాయి. కొన్ని వార్డుల్లో అభ్యర్థుల కొరత కూడా ఇరు పార్టీలకు ఇబ్బందికరంగా పరిణమించింది. మున్సిపల్ ఎన్నిక ల్లో నువ్వా నేనా అనే రీతిలో తలపడే పరిస్థితి ఈ రెండు పార్టీల మధ్యనే కనిపిస్తోంది. ఎలాంటి పరిస్థితులు ఎదురైన గట్టి పోటీ ఇచ్చి, మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుని పురపాలన పగ్గాలను తిరిగి చేపట్టాలన్నదే బీఆర్ఎస్ ప్రధా న టార్గెట్‌గా కనిపిస్తుంది. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఈ దిశగా అభ్యర్థుల జాబితాను ఇప్పటికే రెడీ చేసుకున్నట్లు తెలుస్తుంది.అధికార పార్టీపై స్థానికంగా తలెత్తిన వ్యతిరేకత, ఎమ్మెల్యే గడ్డం వినోద్ రాజకీయ, వ్యవహారిక బలహీనతలు మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పై ప్రభావం చూపే పరిస్థితీ కనిపిస్తోంది. ఈ అసంతృప్తి బీఆర్ఎస్‌కు ఏ మేరకు లాభిస్తాయో? బిఆర్ఎస్ పట్ల ప్రజల ఆదరణ ఈ ఎన్నికల్లో ఎన్ని స్థానాల్లో నిలబెడుతుందోనన్నది ఆసక్తిగా మారింది. ఒకటి మాత్రం నిజం. ఈ ఎన్నికలు అటు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు ఇటు బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు రాజకీయంగా జీవన్మరణమని పరిశీలకులు భావిస్తున్నారు.

# మొదలైన మేడారం మహాజాతర వనదేవతల కొలువుకు వేళాయె

వరంగల్, జనవరి 28, (భారత శక్తి ప్రతినిధి)

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర నేటి నుంచి ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. సాంకేతికతను ఉపయోగించి



భద్రతను పటిష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం అనేక వసతులు కల్పించారుఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర నేటి నుంచి నాలుగు రోజుల పాటు ఘనంగా జరగనుంది. రెండేళ్లకోసారి జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుక ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో కోలాహలంగా ప్రారంభమైంది. కోట్ల మంది భక్తుల కొంగుబంగారమైన వనదేవతలు గద్దెలపై కొలువుదీరే శుభఘడియలు ఆసన్నమవడంతో.. అటవీ ప్రాంతమంతా భక్తజన సంద్రమైంది. నేటి నుంచి ఈ నెల 31 వరకు నాలుగు రోజుల పాటు వైభవంగా సాగే ఈ జాతరకు ప్రభుత్వం సుమారు రూ.251 కోట్ల నిధులతో భారీ ఏర్పాట్లు చేసింది.మేడారం జాతరలో మొదటి ఘట్టం సారలమ్మ రాకతో మొదలవుతుంది. ఇవాళ సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మను ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజారులు గద్దెపైకి తీసుకొస్తారు. అదే సమయంలో మహబూబాబాద్ జిల్లా పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజులు పెళ్లికొడుకుల రూపంలో కాలినడకన మేడారానికి చేరుకుంటారు. జాతరలో అత్యంత కీలక ఘట్టం గురువారం నాడు జరిగే సమ్మక్క ఆగమనం. చిలుకలగుట్టపై నుంచి కుంకుమభరిణ రూపంలో ఉన్న సమ్మక్కను పూజారులు గద్దెపైకి తెచ్చే సమయంలో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పిస్తారు. శుక్రవారం నాడు భక్తులు దేవతలకు నిలువెత్తు 'బంగారం' (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం దేవతల 'వన ప్రవేశం'తో ఈ మహాక్రతువు ముగుస్తుంది.ఈ ఏడాది సుమారు కోటిన్నర మంది భక్తులు మేడారానికి వస్తారని అంచనా. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గద్దెల ప్రాంగణాన్ని పునర్నిర్మించడంతో పాటు, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించింది. రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. వైద్యారోగ్య శాఖ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయగా.. విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా కోసం 21 శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. గిరిజన సంప్రదాయాలను గౌరవిస్తూనే.. ఆధునిక వసతులతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.ఈసారి మేడారం జాతరలో సాంకేతికత ప్రధాన ఆకర్షణగా నిలిచింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తొలిసారిగా కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. జనసమూహాన్ని పర్యవేక్షించడంతో పాటు, జాతరలో తప్పిపోయిన చిన్న పిల్లలను, వృద్ధులను ముఖ గుర్తింపు ద్వారా త్వరగా గుర్తించేందుకు ఈ టెక్నాలజీ తోడ్పడుతోంది. వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘాతో జాతరను హైటెక్ హంగులతో నిర్వహిస్తున్నారు.

పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు పయనం జాతరలో భాగంగా మంగళవారమే పగిడిద్దరాజు పయనం మొదలైంది. పూనుగొండ్ల గ్రామంలోని పెనుక వంశీయుల ఆధ్వర్యంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి, సుమారు 62 కిలోమీటర్ల మేర అటవీ మార్గంలో కాలినడకన మేడారానికి తీసుకువస్తున్నారు. ఆదివాసీల డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య సాగే ఈ ఊరేగింపు భక్తిభావంతో సాగుతోంది. ఇవాళ సాయంత్రానికి పగిడిద్దరాజు మేడారం చేరుకోవడంతో జాతరలో తొలి ప్రధాన ఘట్టం పూర్తవుతుంది.

# అంతకంతకు పెరుగుతున్న గ్యాప్

హైదరాబాద్, జనవరి 28 (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలో ఒక విచిత్రమైన రాజకీయ పరిస్థితి నెలకొంది. వాస్తవానికి అధికారపక్షం వర్సెస్ ప్రతిపక్షం అన్నట్టుగా రాజకీయాలు సాగుతాయి. కానీ, తెలంగాణ రాష్ట్రంలో స్వపక్షంలోనే విపక్షం ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీనికి తోడు నేతలు ఎవరికి వారుగా మీడియాకు లీకులు ఇస్తున్న నేపథ్యంలో.. ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాలపాటు అధికారంలో భారత రాష్ట్ర సమితి ఉంది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. సహజంగానే కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అధికంగా ఉంటుంది. అందువల్ల నేతలు ఎవరికి వారు అన్నట్టుగా మాట్లాడుతుంటారు.హై కమాండ్ కూడా ఈ తరహా నేతల విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తూ ఉంటుంది. చర్యలు తీసుకునే విషయంలో కాస్త వెనకా ముందు ఆలోచిస్తూ ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ అలా చేయడం వల్లే పరిస్థితి ఇప్పుడు ఇక్కడ దాకా వచ్చింది.రేవంత్ రెడ్డి మధ్య, మిగతా మంత్రుల మధ్య గ్యాప్ ఉందని ప్రచారం జరుగుతుంది. అంతకుముందు కొండ సురేఖ, ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క.. వంటి మంత్రులతో రేవంత్ రెడ్డికి గ్యాప్ వచ్చిందని ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా గులాబీ పార్టీ మీడియా, సోషల్ మీడియా ఈ వ్యవహారాలను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. ఇవి ఎంతవరకు వెళ్లాయంటే.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా భట్టి పావులు కదుపుతున్నారనే ప్రచారం దాకా చేరుకున్నాయి. అయితే వీటిని ఖండించాల్సిన నేతలు వినోదం చూస్తుండడంతో.. ఇదంతా నిజమేనని చాలామంది వ్యాఖ్యానిస్తున్నారు.వాస్తవానికి ఇటీవల నైనీ కోల్ వ్యవహారం తెరపైకి వచ్చిన తర్వాత అందరి దృష్టి భట్టివిక్రమార్క మీద కేంద్రీకృతమైంది. దీనికి ప్రధాన కారణం ఆంధ్రజ్యోతి పత్రిక అధిపతి వేమూరి రాధాకృష్ణ రాసిన కొత్త పలుకు. రాధాకృష్ణ ఆ స్థాయిలో రాయడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు భట్టి విక్రమార్కతో కలిసి ఎన్టీవీ చైర్మన్ నరేంద్ర చౌదరి వ్యాపార సాగిస్తున్నారని ఆరోపణలు కూడా వినిపించాయి. ఇవన్నీ కూడా రేవంత్ రెడ్డి వల్ల జరుగుతున్నాయని గులాబీ పార్టీ మీడియా ఆరోపించడం మొదలుపెట్టింది. దీంతో తెరపైకి భట్టి రావాల్సి వచ్చింది. కాకపోతే ఆయన స్వీట్ వార్నింగ్ స్థాయిలో మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు. వాస్తవానికి ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలు.. మీడియా రాస్తున్న కథనాలు ఘాటుగా ఉంటే.. వాటికి కాంగ్రెస్ నేతలు ఇస్తున్న బదులు మామూలుగా ఉంటున్నది. అందువల్లే జనాలలో, సమాజంలో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. అయితే వీటిని ఖండించాల్సిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు మౌనాన్ని ఆశ్రయించడం అనేక అనుమానాలకు కారణమవుతోంది.ఇటీవల భట్టి మాట్లాడినప్పుడు ముఖ్యమంత్రికి తనకు మధ్య సానుకూల వాతావరణం ఉంది అన్నట్టుగా వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి కూడా వివిధ వేదికలలో మంత్రులకు అనుకూలంగా మాట్లాడారు. తమ ప్రభుత్వంపై ఏవైనా వ్యతిరేక కథనాలు రాయాలి అనుకుంటే తన వివరణ తీసుకోవాలని ముఖ్యమంత్రి ఇటీవల వ్యాఖ్యానించడం కొసమెరుపు. ఏది ఏమైనప్పటికీ మంత్రులతో రేవంత్ రెడ్డికి గ్యాప్ ఉందని గులాబీ పార్టీ మీడియా, గులాబీ నాయకులు అంటుంటే.. అదంతా ఉట్టి ప్రచారమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టి పారేస్తున్నారు. కానీ ఈ గ్యాప్ లో మిగతా వారికి కావాల్సిన వినోదం.. అంతకుమించి అనే స్థాయిలో మసాలా లభిస్తోంది.

సీక్రెట్ కాదు.. అఫిషియల్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రుల భేటీపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. లోక్ భవన్ నుంచి అందరి ముందే తామంతా ఒకే కారులో వెళ్లామని, అలా బహిరంగంగా వెళ్లినప్పుడు అది రహస్య భేటీ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల భేటీకి రాజకీయ రంగులు పులుముతూ విష ప్రచారం చేయడం సరికాదని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు.మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన పార్టీ వ్యూహాలపై చర్చించడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత అని, దీనిపై చర్చించుకోవడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు కావాలనే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.పాలనలో సమన్వయం కోసమే తాము సమావేశమయ్యామని, క్యాబినెట్ అనేది ఒక యూనిట్ లాంటిదని మంత్రి వివరించారు. పాలనాపరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చూడటం సీనియర్ మంత్రులుగా తమ బాధ్యత అని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క నివాసంలో జరిగిన చర్చలన్నీ కేవలం ప్రభుత్వం మరియు పార్టీ సమష్టి బాధ్యతలో భాగమేనని, ఇందులో దాపరికాలు ఏమీ లేవని ఆయన తేల్చి చెప్పారు.నిర్మాణాత్మకమైన విమర్శలను తాము ఎప్పుడూ స్వాగతిస్తామని, అయితే కేవలం ఊహాజనిత కథనాలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని శ్రీధర్ బాబు హెచ్చరించారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అడ్డుకోకుండా, ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

# తెలంగాణ బరిలో ఎవరికి వారే... మిత్రపక్షాల మధ్య బేధాలు

హైదరాబాద్, జనవరి 28, (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేళ జనసేన పార్టీ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జనసేన పార్టీ ఒంటరిగా రంగంలోకి దిగాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి నేతృత్వంలో పార్టీ ఇప్పటికే దూకుడు పెంచింది. బుధవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుండటంతో, పార్టీ అభ్యర్థుల ఎంపికను దాదాపు పూర్తి చేసింది. ఇప్పటికే ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన పార్టీ బరిలోకి దిగేదుకు సిద్ధమైంది. ఏపీలో అద్భుతమైన స్ట్రైక్ రేట్ సాధించిన జోష్‌తో, తెలంగాణలోనూ తన సత్తా చాటాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారుజాతీయ స్థాయిలో ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన, తెలంగాణలో మాత్రం బీజేపీని కాదని ఒంటరిగా ముందుకు వెళ్లడం ఆశ్చర్యపరుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుతో పోటీ చేసిన ఈ రెండు పార్టీలు, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల విషయంలో పరస్పరం దూరంగా ఉంటున్నాయి. బీజేపీ సైతం జనసేన పోటీపై ఇప్పటివరకు ఎటువంటి అధికారిక అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం, పొత్తుల గురించి ప్రస్తావించకపోవడం చూస్తుంటే.. కమలం పార్టీ కూడా ప్రస్తుతానికి ఒంటరి పోరుకే మొగ్గు చూపుతున్నట్లు అర్థమవుతోంది.జనసేన పోటీ ప్రధానంగా బీజేపీ ఓట్లకు గండి కొట్టే అవకాశం ఉంది. తెలంగాణలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీజేపీకి బలమైన ఓటు బ్యాంకు ఉంది. ఇప్పుడు అదే పట్టణ ఓటర్లలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న ఇమేజ్, ముఖ్యంగా యువతలో ఉన్న క్రేజ్ కారణంగా ఓట్లు చీలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. జనసేన చీల్చే కొద్దిపాటి ఓట్లయినా అది పరోక్షంగా అధికార కాంగ్రెస్ లేదా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఒకవేళ జనసేన తన బలాన్ని నిరూపించుకుంటే, భవిష్యత్తులో తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు ఈ ఎన్నికలు పునాదిగా మారతాయి.జనసేన వ్యూహం కేవలం ఓట్లు చీల్చడమే కాదని, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకోవడమే ప్రథమ లక్ష్యమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఏపీలో అధికారంలో ఉన్న తమ పార్టీ ఇమేజ్ కీలక మున్సిపాలిటీలు, ఖమ్మం, నిజామాబాద్ వంటి చోట్ల తమకు కలిసి వస్తుందని వారు ఆశిస్తున్నారు. బీజేపీతో పొత్తు లేకపోవడం వల్ల ఆ పార్టీ అసంతృప్త నేతలు కూడా జనసేన వైపు చూసే అవకాశం ఉందని చెబుతున్నారు. బీజేపీ నాయకత్వం మాత్రం జనసేన ప్రభావం పెద్దగా ఉండదని భావిస్తోంది. అయినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో చీలిపోయే ప్రతి ఓటు గెలుపోటములను తలకిందులు చేసే అవకాశం ఉన్న మున్సిపల్ పోరులో, జనసేన సై అనడం బీజేపీకి మింగుడుపడని విషయమే. ఈ ఫ్రెండ్లీ కాంటెస్ట్ ' మున్సిపల్ ఫలితాల తర్వాత తెలంగాణలో ఎన్డీఏ భవిష్యత్తును ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి. గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అయితే బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారన్న కారణంగా పోటీ నుంచి విరమించుకున్నారు. ఈ సారి అలా నామినేషన్లు వేసిన తర్వాత ఉపసంహరించుకునే అవకాశం ఉండదని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

# ప్రైవేట్ సహకారంతో రిజిస్టార్ కార్యాలయాలకు మహర్దశ

హైదరాబాద్, జనవరి 28, ( (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణలో రెవెన్యూ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి, అత్యాధునిక సౌకర్యాలతో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. వివాహ రిజిస్ట్రేషన్లకు మినీ మ్యారేజ్ హాల్, గర్భిణీలకు ఫీడింగ్ రూమ్స్, పిల్లలకు క్రెచ్ వంటి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రాల్లోనూ ఇలాంటి భవనాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.తెలంగాణ ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో స్వార్థపూరిత నిర్ణయాల వల్ల చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంస్కరిస్తున్నామని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, ప్రైవేటు నిర్మాణ సంస్థల సహకారంతో వీటిని అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్నామన్నారు. సుమారు 3 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఈ కార్యాలయాల్లో కేవలం రిజిస్ట్రేషన్లే కాకుండా, ప్రజల సౌకర్యార్థం అనేక ప్రత్యేక వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ సమీకృత భవనాల్లో కేవలం ఆఫీసులే కాకుండా సామాజిక అవసరాలకు ప్రాధాన్యతనిచ్చినట్లు పొంగులేటి వివరించారు. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 'మినీ మ్యారేజ్ హాల్' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతల కోసం ఫీడింగ్ రూమ్స్, చిన్న పిల్లల కోసం క్రెచ్ సదుపాయం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం, విశాలమైన వెయిటింగ్ ఏరియాలు. ఈ భవనాల నిర్మాణంతో పాటు ఐదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా సంబంధిత నిర్మాణ సంస్థలే చూసుకుంటాయని మంత్రి స్పష్టం చేశారు.రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో కూడా ఇలాంటి ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే తాలిమ్‌లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని.. జూన్ 2 నాటికి వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బుధవారం పటాన్‌చెరు-శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కన్‌స్ట్రక్షన్ నిర్మించే భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఇప్పటికే తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్, ఈ-ఆధార్ సంతకం వంటి సౌకర్యాలు ప్రజల సమయాన్ని ఆదా చేస్తున్నాయని, ఈ సంస్కరణలు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొస్తాయని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు

# పార్టీలు హైడ్రామా.. అభ్యర్థుల్లో టెన్షన్

అదిలాబాద్, జనవరి 28, (భారత శక్తి ప్రతినిధి)

రాష్ట్ర ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికల గంట మోగించింది. ఎన్నికల కోడ్ అమలు చేయడమేకుండా ఎన్నికల షెడ్యూల్ అధికారికంగా ప్రకటించింది. ఎన్నికల ప్రక్రియ బుధవారంతో ప్రారంభమై వచ్చేనెల 13న ఎన్నికల ఫలితాలతో ముగిసే విధంగా షెడ్యూలు ఖరారైంది. దీంతో జిల్లాలో మున్సిపల్ ఎన్నికల హడావుడి ప్రారంభం అయింది .నిర్మల్ జిల్లా లో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీ లు ఉండగా నిర్మల్ జనరల్ మహిళకు ఖానాపూర్ భైంసా మున్సిపాలిటీలను జనరల్ కు కేటాయించారు. నిర్మల్ మున్సిపాలిటీలో మొ త్తం 42 వార్డులు, భైంసాలో 26 ఖానాపూర్ లో 12 వార్డులు ఉండగా ఇప్పటికీ ఎస్సీ ఎస్టీ బీసీ జనరల్ స్థానాలను అధికారికంగా ప్రకటించారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 1,69,285 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నిర్మల్‌లో 42 వార్డులు, భైంసాలో 26, ఖానాపూర్‌లో 12 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలో హైడ్రామా నెలకొనగా పోటీ చేసే అభ్యర్థులు టెన్షన్ పరమమైంది. మున్సిపల్ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి భారత రాష్ట్ర సమితి ఎంఐఎం ప్రధాన పార్టీలతో పాటు ఆమ్ ఆద్మీ కమ్యూనిస్టులు జనసేన తదితర పార్టీలు ఎన్నికల బరిలో తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా మార్గుండా యోగిత పేరును అధికారికంగా ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ నుంచి దాదాపు అప్పల గణేష్ చక్రవర్తి పేరు ఖరారైంది. ఇక సెట్టింగ్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నిర్మల్‌లో బిజెపి అభ్యర్థిత్వంపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు.ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలో అక్కడ సెట్టింగ్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, బొజ్జు పటేల్ మున్సిపల్ స్థానాలను కైవసం చేసుకునేందుకు అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టారు. కాంగ్రెస్ బిజెపిలో ఆశావాదులు ఎక్కువగా ఉండటంతో ఒక్కొక్క వార్డు నుంచి నలుగురు పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు అయితే నామినేషన్ల ప్రక్రి య బుధవారం నుండి ప్రారంభ కాలు నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై పార్టీలో ప్రతిష్ట నెలకొంది. ఇప్పటికే ఆయా వార్డుల్లో తమకి టికెట్లు వస్తాయన్న ధీమతో పార్టీ అభ్యర్థులు ప్రచారం కూడా చేపడుతున్నారు. అయితే ఇందులో ఎవరికి బీఫామ్ వస్తే వారే ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారు. నామినేషన్ల ప్రక్రియ మూడు రోజుల్లో మిగిలి ఉన్న నేపథ్యంలో పార్టీ ఫిరాయింపుల అంశం పార్టీలకు కీలకంగా మారే అవకాశం ఉంది.

రాష్ట్ర ఎన్నికలకు సంఘం మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూలు ప్రకటించడంతో నామినేషన్ల స్వీకరిస్తున్నారు. ఈనెల 20 నుంచి 30 వరకు నామినేషన్ల స్వీకరణ, 31 31న పరిశీలన చేపట్టనున్నారు. 1న తప్పుడు నామినేషన్ల రిజెక్ట్ చేయనున్నారు. వచ్చేనెల 2న అప్పిల్ అవకాశం అవకాశం కల్పించారు. 3 న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం పోటీచేసే అభ్యర్థుల జాబితా విడుదల చేయనున్నారు. 11న కౌం టింగ్ నిర్వహించి 13న ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతం గా నిర్వహించుకునేందుకు అన్ని శాఖ ల సమన్వయంతో జిల్లా అధికారులు చర్య లు ప్రారంభించారు.

# నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా కొనసాగుతుంది: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 28 (భారత శక్తి): జిల్లాలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా కొనగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.

బుధవారం సాయంత్రం, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి భైంసా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. తొలుత కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, సిబ్బందికి సూచనలు చేశారు. నామినేషన్ వేసే వారికి అవసరమగు తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు.

అనంతరం వార్డుల వారిగా ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కౌంటర్లు తిరుగుతూ, నామినేషన్ల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ, ఎన్నికల నామినేషన్ల సరళి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ, నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు వివిధ రకాల ప్రభుత్వ ధృవీకరణ పత్రాలు అవసరమవుతాయని, అధికారులు వారికి అవసరమైన పత్రాలు వెంట వెంటనే అందించాలని సూచించారు.

ఈ నామినేషన్ల కేంద్రం తనిఖీలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా ఎఎస్పీ రాజేష్ మీనా, తహసిల్దార్ ప్రవీణ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించండి : సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 28: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లా కేంద్రం మున్సిపాలిటీ లోని 7, 8, 27 వార్డుల్లో సిపిఎం పోటీ చేస్తుందని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి అనేక హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ఓటు వేసిన వారికి ముఖం కూడా చూపించకుండా తమ స్వలాభాల కోసం వ్యాపారాలు, కబ్జాలు, సెటిల్మెంట్ ల కోసం తిరిగే నాయకులకు ఓటు వేయవద్దని ప్రజల కోసం కొట్లాడుతూ తప్పుడు కేసులు మీదేసుకొని లాఠీచార్జీలు, దెబ్బలు తిని జైలు కెళ్ళి తిరిగి మళ్లీ ప్రజల కోసం కొట్లాడుతున్న సిపిఎం అభ్యర్థులకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని మీ మీ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వెంకట్ గౌడ్, మోతిరామ్ నాయక్, కొత్త నరసింహులు పాల్గొన్నారు.

# జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తరలిస్తే చూస్తూ ఊరుకోం: టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 28:




సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు దూరంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తరలించే ఆలోచనపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పేరుతో అధికారులు సంగారెడ్డి రిజిస్ట్రేషన్ ఆఫీసును పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని కర్ధనూరుకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నిర్ణయం సంగారెడ్డి ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుంది. జిల్లా కేంద్రం నుంచి ఈ ఆఫీసును మార్చడం అన్యాయం' అని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తీసుకుంటున్న ఈ నిర్ణయాన్ని జగ్గారెడ్డి తప్పుబట్టారు. "మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఈ విషయంపై చర్చించేవరకు ఎలాంటి తరలింపు ఆలోచనలు చేయవద్దు. ఇది నా సూచన మాత్రమే కాదు, హెచ్చరిక కూడా" అని ఆయన అధికారులను ఉద్దేశించి పేర్కొన్నారు. ప్రస్తుతం సంగారెడ్డిలో ఉన్న పటాన్ చెరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కావాలంటే పటాన్ చెరు ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని, అంతేకానీ సంగారెడ్డికి చెందిన కార్యాలయాలను దూరం చేయవద్దని ఆయన కోరారు. సంగారెడ్డిలోని ఆస్తులను ఇక్కడే రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుండాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం అంటే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు నెలవుగా ఉండాలని, అలాంటిది ముఖ్యమైన రిజిస్ట్రేషన్ ఆఫీసును తరలిస్తే నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వికేంద్రీకరణ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని ఆయన సూచించారు.

# ఓటింగ్ ప్రజాస్వామ్యానికి పునాది

ఒక వ్యక్తి కున్న ఓటు ప్రభుత్వాల నిర్ణయాన్ని ప్రభావితం చేసే సాధనం. సామాజిక 'ఆర్థిక 'రాజకీయ మార్పుకు ఓటే సాధనం

ఓటింగ్ రాజ్యాంగ బాధ్యత

ఓటర్లు అందరు సకాలములో ఓటింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు వెయ్యాలి. ఓటింగులో పాల్గొనడం ప్రతి ఓటరు రాజ్యాంగం కల్పించిన

ప్రాథమిక బాధ్యత. ఓటరుగా నమోదైన ప్రతి వ్యక్తి ఓటింగ్ లో తప్పని సరిగా పాల్గొనాలి. ఓటు వేసి తన సార్వభౌమాధికారాన్ని వినియోగించుకోవాలి. ఓటర్లు ఇతర ఓటర్లను కూడా ఓటు వేసే విధంగా ప్రభావితం చేయాలి. దేశంలో ఓటింగ్ ప్రజాస్వామ్యం పటిష్టతకు ముఖ్య సాధన ఓటర్లు తమ అభిప్రాయాలు చేయడానికి తెలియజేయడానికి ఓటింగ్ సరైన విధానం.

ఓటరు ఆలోచించాలి

ఓటు ఎవరికి వేయాలి? ఎందుకు వేయాలి? ఏమిచేస్తారని వేయాలి? అన్న ప్రశ్నలకు సమాధానం పట్ల ఆసక్తి గల ఓటరు ఆలోచించాలి . ఎన్నుకోబోయే పార్టీ/ అభ్యర్థి రాష్ట్ర ప్రజల భవిష్యత్ తరాలకు కావలసిన జీవన నాణ్యతను నిర్ణయించే శక్తి సామర్థ్యాలు ఉన్న అభ్యర్థిని ఎన్నుకోవాలి.

పట్టణ ఓటర్లు యువత ఓటింగు లో పాల్గొనాలి

పట్టణ ప్రాంత ప్రజలు యువత పోలింగ్ రోజును సెలవు దినంగా పాటించకూడదు.

తమ తల రాతను మార్చే శాసన కర్తలను ఎన్నుకునే దినం.

రాష్ట్ర ప్రగతి పురోగతికి పాటు పడే సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు దినంగా ఓటర్లు బావించాలి.ఓటు పోయేకపోవడం వల్ల మీ గొంతును మీరు వదులుకోవడమే. మీరు ఓటు వేయకపోతే మీకోసం మరొకరు నిర్ణయం తీసుకుంటారు. అవినీతి పరులు నేర చరితులు రాజ్యవేలే అవకాశం కలిగించవద్దు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి 'ఆర్థిక ప్రగతి ప్రయోజనాలు చెకూర్చే సామర్థ్యం వున్న అభ్యర్థులకు ఓటు ద్వారా మద్దతు ఇవ్వాలి.

ఎన్నికలే మార్పుకుఅవకాశం

ప్రజాస్వామ్యంలో మార్పు కోసం ఎన్నికలే ఓటర్లకు ఉన్న గొప్ప అవకాశం. ప్రతి వయోజనులు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి. పోలింగ్ జరిగే ప్రదేశానికి సకాలంలో వెళ్లాలి.ఓటు వేయడంసామాజిక.రాజకీయ హక్కు రక్షణగా భావించాలి. ఓటరుకు మాత్రమే పనికిమాలిన ప్రభుత్వాలను మార్చే శక్తి ఉంది. ప్రతి ఓటరు ఓటు వేయడం కర్తవ్యంగా భావించాలి. ఓటు వేయడానికి ప్రేరేపించాలి. ఆర్థిక ప్రలోభాలకు ఒత్తిడి కి లొంగ కూడదు.అభ్యర్థి చేసే ఒత్తిడి మాయ మాటలు నమ్మకూడదు. ఓటర్లు ప్రజలకు సేవ చేస్తున్న వారిని మాత్రమే ఎన్నుకోవాలి. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి పెట్టుబడుల సమీకరణక ఆదాయ కల్పనకు 'ఉపాధి కల్పన మహిళా 'యువత సాధికారిత సామర్థ్యం ఉన్న పార్టీని /అభ్యర్థులను మాత్రమే ఎన్నుకోవాలి. ఓటుతో ఆర్థిక ప్రగతికి చోటు ఇవ్వాలి. ప్రజలకు పనిచేసే అభ్యర్థిని మాత్రమే ఎన్నుకోవాలి. అభ్యర్థి కులం మతం లేదా ప్రాంతం ఆధారంగా ఓటు వేయకూడదు. ప్రజలకు నమ్మకంగా పనిచేసే నీతి నిజాయితీగా అభ్యర్థిని ఎన్నుకోవాలి. ఎన్నుకున్న తప్పుడు ప్రభుత్వం మన రాష్ట్రాన్ని ప్రజలను సమస్సల్లోకి నెట్టివేస్తుంది. ఓటర్ గాఢ నిద్ర నుండి మేల్కొని ఉ



త్తమ అభ్యర్థులకు ఓటు వేయాలి. ఓటు తప్పనిసరిగా వేసి అవినీతి నాయకుల నుండి రాష్ట్రాన్ని రక్షించాలి. ఓటర్లు ఎన్నికల సమయంలో మని మద్యం మజిల్ పవర్ కు భయపడకుండా ఓటు వేయాలి.

మార్పు కోసం ప్రతిజ్ఞ

మార్పు కోసంఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. ప్రతి ఓటరు ఓటింగ్లో పాల్గొనడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలి. మార్పు కోసం ఓటును వినియోగించుకోవాలి. ఓటర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య రక్షణకు తమ ఓటునుహక్కును పెట్టుబడిగా పెట్టాలి. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు చేసిన వాగ్దానాలను మేనిఫెస్టోలను అమలు తీరును పరిశీలించాలి. రాష్ట్ర భవిష్యత్తు రాబోయేప్రభుత్వ చేతుల్లోనే ఉంటుంది కాబట్టి అవినీతి రహిత పేదరిక రహిత నిరుద్యోగ రహిత రాష్ట్ర ఆవిర్భావానికి నిజాయితీగల అభ్యర్థులకు ఓటర్లు మద్దతు పలకాలి. రాష్ట్రాన్ని ప్రగతిశీల రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేయాలి. ఓటు మార్పుకు సాధనం ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై అసంతృప్తిని వ్యక్తం చేయడానికి ఓటింగ్ అత్యంత ప్రభావంతమై నటువంటి మార్గం. ఓటింగు పౌరుల సమిష్టి స్వరం ప్రతిబింబిస్తుంది. విజ్ఞతతో వేసే ఓటు సమాజములో గణనీయమైన సామాజిక ఆర్థిక రాజకీయ మార్పులను తీసుకొస్తుంది .ఓటు

ప్రభుత్వాలను నడిపించే శక్తిని కలిగి ఉంది. చారిత్రకంగా చూస్తే ఓటు ప్రభుత్వాలను మార్చివేసింది.ఓటు వేయడం పౌరబాధ్యత.

ఓటర్లు మేల్కొవాలి ప్రగతి శీల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి.

నేదునూరి కనకయ్య

అధ్యక్షులు తెలంగాణ ఎకనమిక్ ఫోరమ్కరీంనగర్

9440245771

# రీసర్వే పనులను చురుగ్గా చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప, జనవరి 28(భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులను జిల్లాలో ప్రణాళిక ప్రకారం చురుగ్గా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్ఏ) ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మితో కలిసి భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీ లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు.

ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో పాటు జేసీ నిధి మీనా హాజరయ్యారు.

సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి విసి ముగిసిన అనంతరం జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో విసి ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి వారి సూచనల మేరకు.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న రీసర్వే పూర్తి చేయాల్సిన గ్రామాలను ప్రతి నెలా ప్రతి నియోజకవర్గానికి 2 గ్రామాలను ప్రతినెలా 3వ వారంలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యూటేషన్ లో భాగంగా సేల్, సబ్ డివిజన్, జాయింట్ ఎల్పిఎం తదితర వ్యక్తిగత వివరాలలో ఎటువంటి తప్పిదాలు లేకుండా పూర్తి చేసి పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసేలా.చర్యలు చేపట్టాలన్నారు. రీసర్వే కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ రీసర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు.


అలాగే భూ సమస్యలపై పిజిఆర్ఎస్ ద్వారా అందే అర్జీల పట్ల సదరు అర్జీ ప్రాథమిక పరిశీలన దశలో ఉన్నట్టు సమాచారం అర్జీదారులకు అందించడం బాధ్యతగా చేపట్టాలన్నారు.

ఈ విసి కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల నుండి ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్ర మోహన్, చిన్నయ్య లు హాజరవ్వగా కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి ల్యాండ్ సర్వే శాఖ ఈడి శాంతరాజు, సంబంది సెక్షన్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ అధికారులు సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్వతప్రాంతపు జీవనోపాధికి ఉపాధి హామీ పథకమే రక్ష

## –మన్రేగ లేకుంటే వలస జీవితాలు మొదలవుతాయి

## –కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి



ఆదిలాబాద్ జిల్లా,జనవరి 28 (భారత శక్తి): వేసవికాలంలో పర్వత ప్రాంతపు ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమే జీవితాలను రక్షిస్తుందని, వలసలు నిరోధిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు.బోథ్ మండలంలోని నాగపూర్, జైనురు పల్లె గ్రామాలలోని ఉపాధి హామీ కూలీలతో మన్రేగా బచావో సంగ్రామ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి మాట్లాడుతూ కొత్త చట్టంతో సాంకేతిక సమస్యలతో పాటు పనుల నిర్వహణలో అడ్డంకులు కలిగే అవకాశాలు ఉన్నాయని, సదరు కూలీకి రెండుసార్లు ఫోటో తీయడం, డిజిటల్ మాస్టర్స్ సాధారణ కూలీలకు తమ హాజరు పడ్డదో లేదో తెలిసే అవకాశం లేదని, ఐరిష్ విధానాన్ని, యుక్తదార విధానాన్ని వెనక్కు తీసుకొని పాత పద్ధతిలోనే పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, రాజకీయాల కోసం పథకాల పేరు మార్పు మంచిది కాదనీ, పాత పద్ధతిలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాగపూర్ సర్పంచ్ సిడాం దేవరావు, దన్నూర్ బి గ్రామ సర్పంచ్ ఎల్మా రోహిణి వినయ్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్, గ్రామ పటేళ్లు, యువకులు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పటిష్ట బందోబస్తును పరిశీలించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 28 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా నిర్మల్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన బందోబస్తును జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ గారు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, అభ్యర్థులు మరియు వారి అనుచరులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. గుంపులు గుంపులుగా రావడం, నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపడతామని తెలియ జేశారు.సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, మెటల్ డిటెక్టర్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.జిల్లాలో శాంతియుత, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.ఈ పరిశీలనలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు, మున్సిపల్ కమిషనర్, ఇన్స్పెక్టర్లు నైలు, కృష్ణ, సమ్మయ్య, ఎస్ఐ గణేష్, మరియు పోలీసు సిబ్బంది తదితర సిబ్బంది ఉన్నారు.

# నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా సాగాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 28 (భారత్ శక్తి ) : రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

బుధవారం పట్టణంలోని మున్సిపల్, జిల్లా పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు ప్రక్రియపై ఎటువంటి సందేహాలు ఉన్న హెల్ప్ డెస్క్ సిబ్బంది నివృత్తి చేయాలని తెలిపారు.

అనంతరం నామినేషన్ స్వీకరణ కేంద్రాలు పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ, నామినేషన్ దాఖలు ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన అన్ని ఫారములు, రిజిస్టర్ లను జాగ్రత్తగా పూరించాలి అని తెలిపారు. అధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు నామినేషన్ల స్వీకరణకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు అందజేస్తూ ఉండాలని చెప్పారు.

అనంతరం జిల్లాపరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు.

ముందుగా హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ, నామినేషన్ వేసేవారికి సహాయపడాలని అన్నారు. తగినన్ని కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

నామినేషన్లు స్వీకరించే అధికారులతో మాట్లాడుతూ, ఎక్కడకూడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో ప్రతిరోజు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించాలని తెలిపారు.

ఈ నామినేషన్ కేంద్రం తనిఖీలో ఆర్డీఓ రత్నకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భైంసా మున్సిపాలిటీలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం.




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 28(భారత శక్తి): భైంసా మున్సిపాలిటీలో బుదవారం ఉదయం 10.30 గంటల నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్ ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

అభ్యర్థులు నామినేషన్‌కు సంబంధించిన వివరాలు, సందేహాల విషయంలో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న అసత్య సమాచారాన్ని నమ్మకుండా, నేరుగా సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించడంతో పాటు, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి : సాధారణ పరిశీలకులు డి. ప్రశాంత్ రెడ్డి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 28: కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికలకు



సంబంధించి నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను సాధారణ పరిశీలకులు డి. ప్రశాంత్ రెడ్డి బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు ఏయే ధ్రువీకరణ పత్రాలు జత చేయాలో స్పష్టంగా తెలియజేయాలని, ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే వెంటనే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల వివరాలను పరిశీలించారు.

మొదటి నామినేషన్ కేంద్రం రెవెన్యూ సెక్షన్?లో ఏర్పాటు చేయగా, అక్కడ 1 నుండి 15 వార్డుల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.రెండవ నామినేషన్ కేంద్రం కౌన్సిల్ మీటింగ్ హాల్?లో ఏర్పాటు చేయగా, అక్కడ 16 నుండి 45 వార్డుల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.మూడవ నామినేషన్ కేంద్రాన్ని అకౌంట్స్ సెక్షన్?లో ఏర్పాటు చేసి, అక్కడ 46 నుండి 49 వార్డుల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.అలాగే అన్ని నామినేషన్ కేంద్రాలలో సీసీ కెమెరాలు, డిజిటల్ వాచ్?లు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు పరిశీలకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, తహసిల్దార్ జనార్ధన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి హెల్ప్‌లైన్ 9100577132 ఏర్పాటు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 28 (భారత శక్తి): నిర్మల్ జిల్లాలోని మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి, ఫిర్యాదుల స్వీకరణ కొరకు జిల్లాలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. 9100577132 నంబరు ను సంప్రదించడం ద్వారా మున్సిపల్ ఎన్నికలపై ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత కొరకు హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# బాన్సువాడలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఈల త్రిపాఠి


కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 28: బాన్సువాడలో నామినేషన్ల పరిశీలన స్వీకరణ కేంద్రాలను జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఈలా త్రిపాఠి సందర్శించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల విధుల పట్ల పూర్తి జాగ్రత్తతో వ్యవహరించాలని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఈల త్రిపాఠి అధికారులకు సూచించారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం బాన్సువాడ మండలంలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ స్వీకరణ ప్రక్రియను, నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. మొదటి రోజు ఆయా డివిజన్లు, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర అన్ని ప్రక్రియలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రోజువారీగా వెంటనే టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని సూచించారు.అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను సక్రమంగా దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుబడి పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు సంబంధిత మున్సిపాలిటీ పరిధిలోని ఏదైనా డివిజన్/ వార్డులో ఓటరుగా నమోదై ఉండవచ్చని తెలిపారు.



అయితే ప్రతిపాదకులు (ప్రపోజర్స్) మాత్రం అదే డివిజన్/వార్డుకు చెందిన ఓటర్లై ఉండాలని స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో అన్ని నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచామని, నామినేషన్ పత్రాల పరిశీలన కోసం అవసరమైన సిబ్బందిని నియమించామని తెలిపారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించబడతాయని, ఎవరూ కూడా ఎలాంటి అపోహలు లేదా సందేహాలకు గురికావద్దని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ‘కింగ్ 100’లో టబు..
## నాగార్జున ఏమన్నారంటే!



కుర్ర హీరోలతో పోటీగా సినిమాలు చేస్తూ వెండితెరపై సందడి చేస్తున్నారు అగ్ర కథానాయకుడు నాగార్జున. గతేడాదిలో రెండు చిత్రాల్లో కనిపించి ఆకట్టుకున్న ఆయన ఇప్పుడు తన వందో సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఇందులో సీనియర్ నటి టబు నటించనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై నాగార్జున ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను, టబు ఎన్నో ఏళ్లుగా స్నేహితులమని తెలిపారు. ఆమె ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి తెలుసన్నారు. వందో సినిమా చేస్తున్నా అని తెలియగానే అందులో భాగం కావాలని టబు కోరుకున్నట్లు చెప్పారు. దీంతో ఎన్నో రోజుల నుంచి వస్తోన్న వార్తలకు మరింత బలం చేకూరింది. గతంలో వీరిద్దరూ ‘నిన్నే పెళ్లాడతా’, ‘ఆవిడా మా ఆవిడే’లో నటించిన విషయం తెలిసిందే. ఇక ఈ సినిమా గురించి నాగార్జున మాట్లాడుతూ.. ‘‘ప్రేక్షకుల అభిరుచులు వేగంగా మారుతున్నాయి. మేం వాళ్ల కోసం ప్రత్యేకమైన చిత్రాన్ని అందిస్తున్నామని అందరికీ తెలియాలి. ఆడియన్స్ వాస్తవికతకు దగ్గరగా ఉండే వాటిని ఇష్టపడుతున్నారు. అందుకే ఇందులో యాక్షన్ సన్నివేశాలు వీఎఫ్ఎక్స్ ఆధారంగా కాకుండా రియల్‌గా ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. కథకు తగ్గట్టు సహజంగా దీన్ని రూపొందిస్తున్నాం’’ అని నాగార్జున తెలిపారు. రిలీజ్ తేదీ విషయంలో కూడా తాను తొందరపడి నిర్ణయాలు తీసుకోవట్లేదని చెప్పారు. నాగ్ వందో సినిమా విషయానికొస్తే.. గతేడాది ‘కూలీ’, ‘కుబేర’ లాంటి చిత్రాలతో అలరించిన ఆయన తమిళ దర్శకుడు రా.కార్తీక్ దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రమిది. ‘కింగ్ 100’ అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రంలో నాగార్జున కనిపించే విధానం కొత్తగా ఉంటుందని, ఇందులో ముగ్గురు కథానాయికలు ఉండనున్నట్లు సమాచారం.

## రజనీకాంత్ ఆటోబయోగ్రఫీ..
## ఐశ్వర్య ఆసక్తికర వ్యాఖ్యలు



రజనీకాంత్..నటుడిగానే కాదు వ్యక్తిగానూ ఎందరికో ఆదర్శం. బస్ కండక్టర్ నుంచి సూపర్‌స్టార్‌గా సాగిన ప్రయాణం స్ఫూర్తిదాయకం. రజనీకాంత్ జీవితం తెరపైకి వస్తుందంటూ కొన్నాళ్ల క్రితం ప్రచారం జరిగింది. ఆ బయోపిక్ గురించి అధికారిక ప్రకటన కూడా లేదు. అయితే, తాజాగా రజనీ కుమార్తె ఐశ్వర్య అభిమానులకు శుభవార్త చెప్పారు. తన తండ్రి ఆటోబయోగ్రఫీ వర్క్‌ను ఇప్పటికే ప్రారంభించారని తెలిపారు. అది ప్రపంచవ్యాప్తంగా ఓ సెన్సేషన్ అవుతుందంటూ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తి రేకెత్తించారు. సూపర్‌స్టార్ కుమార్తెగా ఉండటం అంత తేలికైన విషయం కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సినీ రంగంలో ఏఐ వినియోగం మంచి పరిణామమే అయినా.. అది ఎప్పటికైనా కృత్రిమమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అభిప్రాయపడ్డారు. ‘కోచ్చాడయాన్’ లాంటి సినిమాలు తీయడం తనకు ఇష్టమన్నారు. అధునాతన సాంకేతికతో అలాంటి చిత్రాలను ఇప్పుడు తెరకెక్కించడం సులువు అని పేర్కొన్నారు. ‘3’, ‘లాల్ సలామ్’లాంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఐశ్వర్య ‘విత్ లవ్’ కు నిర్మాతగా వ్యవహరించారు. ‘టూరిస్ట్ ఫ్యామిలీ’ డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా మదన్ తెరకెక్కించిన రొమాంటిక్ మూవీ ఇది. అనస్వర రాజన్ హీరోయిన్. ఈ సినిమా తెలుగులోనూ ఫిబ్రవరి 6న విడుదల కానుంది.

## ప్రతి సినిమాకు భారీ సెట్స్..
## గుణశేఖర్‌కు మహేశ్‌బాబు హెచ్చరిక

గుణశేఖర్.. ఈ పేరు చెబితే ప్రతి తెలుగు ప్రేక్షకుడికి గుర్తొచ్చేది ఆయన వేసిన భారీ సెట్స్. ‘చూడాలని వుంది’ మొదలుకుని, ‘ఒక్కడు’, ‘అర్జున్’, ‘సైనికుడు’ ఇలా ప్రతి సినిమాకూ భారీ సెట్స్ వేశారు. అప్పట్లో అదో ట్రెండ్ సెట్టర్. ఇలా వరుసగా సెట్స్ వేస్తూ సినిమాలు తీయడం కూడా తనని దెబ్బ కొట్టిందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ విషయంలో అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు కూడా హెచ్చరించారని తాజాగా ఓ ఇంటర్వ్యూలో నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ‘‘భారీ సెట్స్ వేసి సినిమాలు తీయడం నన్ను దెబ్బ కొట్టింది. ‘సైనికుడు’ సమయంలో వేయి స్తంభాల గుడి సెట్ వేశాం. అప్పటికే నేను ఆ ట్రాప్‌లో పడ్డాను. ఈ మూవీ షూటింగ్ సమయంలో మహేశ్‌బాబు నన్ను హెచ్చరించారు. ‘సెట్స్ భారీగా వేయడం వల్ల అక్కడే ఎక్కువ వర్క్ చేయాలనే ఉద్దేశం పెరుగుతోంది. దీంతో కథ అటువైపు తిరుగుతోందని అనిపిస్తోంది’ అని సున్నితంగా హెచ్చరించారు. ఆలోచిస్తే, అది కూడా నిజమేనని అనిపించింది. సెట్ వేశాం కదాని, అక్కడ సన్నివేశాలు పెంచడం, డేలో ఒక పాట, నైట్ ఎఫెక్ట్‌లో మరో పాట తీయడం. దీంతో కథ లిమిట్ అయిపోతోంది.


# సినిమా

# కొత్తదనం కోసమే



తన పాటలతో అనేక మంది అభిమానులను సంపాదించుకున్న గాయకుడు అర్జిత్ సింగ్. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, పంజాబీ భాషల్లో అదరగొడ్డాడు. టాలీవుడ్‌లోనూ తనదైన ముద్ర వేశాడు. ఇలాంటి గాయకుడు ఒక్కసారిగా రిటైర్మెంట్ ప్రకటించడం ఆయన అభిమానులతో పాటు సంగీత ప్రియులను ఆశ్చర్యానికి గురిచేసింది. అందుకే ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ వరుస పోస్టులు పెట్టారు. దీంతో ఈ ప్లేబ్యాక్ సింగర్ తాను తీసుకున్న నిర్ణయానికి గల కారణాలను వెల్లడించాడు. కొత్త గాయకుల ప్రతిభను ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాడు. చాలా రోజుల నుంచి ఈ నిర్ణయం తీసుకోవాలని ఆలోచిస్తున్నాడట. అవసరమైన ధైర్యం కూడగట్టుకుని చెప్పేందుకు ఇంత టైం పట్టిందట. తనకు కొత్తదనం ఇష్టమని, సంగీతంలో కొత్త అంశాలు నేర్చుకోవాలనుకుంటున్నట్లు చెప్పాడు. కొత్త గాయకులు కూడా తనకు స్ఫూర్తినిచ్చారని, వారి పాటలు కూడా వినాలనుకుంటున్నట్లు వెల్లడించాడు.

# అప్పుడే తెలిసొచ్చింది



గుణశేఖర్ పేరు చెబితే టాలీవుడ్ ప్రేక్షకుడికి గుర్తొచ్చేది ఆయన వేసిన భారీ సెట్స్. చూడాలని వుంది మూవీ మొదలుకుని ఒక్కడు, అర్జున్, సైనికుడు.. ఇలా ప్రతి సినిమాకూ భారీ సెట్స్ వేశాడు. అప్పట్లో అదో ట్రెండ్ సెట్టర్. ఇలా వరుసగా సెట్స్ వేస్తూ సినిమాలు తీయడం ఆయనను దెబ్బ కొట్టిందట. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయనే స్వయంగా వెల్లడించాడు. సైనికుడు సమయంలో వేయి స్తంభాల గుడి సెట్ వేశారట. భారీ సెట్స్ వేయడం వల్ల అక్కడే ఎక్కువ వర్క్ చేయాలనే భావన కలుగుతుందని, ఫలితంగా కథ అటువైపు తిరుగుతుందని హీరో మహేశ్‌బాబు సున్నితంగా హెచ్చరించాడట. ఆలోచిస్తే తనకూ అదే నిజం అనిపించిందట. సెట్ వేశాం కదా అని డేలో ఒక పాట, నైట్ ఎఫెక్ట్‌మరో పాట తీయడంతో కథ లిమిట్ అయిపోయిందట. అప్పుడు గానీ మేల్కొని సెట్స్ జోలికి వెళ్ల కూడదు అనుకున్నాడట. ప్రస్తుతం ఆయన యుఫోరియా మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఫిబ్రవరి 6న విడుదల కానున్న ఈ మూవీలో భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు.

# అందమైన సమస్య


బాలీవుడ్ నుంచి టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. తెలుగులో ఈ అమ్మడు చేసింది తక్కువ సినిమాలే అయినా.. విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ‘సీతారామం’తో మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా.. కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్‌గా మారిపోయింది. ఆ తర్వాత నానితో చేసిన హాయ్ నాన్న సినిమా కూడా సూపర్ హిట్ అయ్యింది. కానీ ఆ వెంటనే విజయ్ దేవరకొండతో కలిసి చేసిన ఫ్యామిలీ స్టార్ మూవీ డిజాస్టర్ అయ్యింది. దాంతో మృణాల్ స్పీడ్ కు బ్రేక్ పడింది. మళ్లీ చిన్న గ్యాప్ తీసుకొని కల్కి సినిమాలో చిన్న రోల్ చేసింది. ఇక ప్రస్తుతం క్రేజీ ప్రాజెక్టలను చేస్తున్న మృణాల్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫొటోలను షేర్ చేస్తూ తన ఫాలోవర్స్‌కి కన్నుల విందు చేస్తుంది. తాజాగా క్యూట్, క్లాసిక్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఫొటోలకు పోజు ఇచ్చింది. వీటికి ‘అత్యంత అందమైన సమస్య’ అంటూ క్యాప్షన్‌కూడా ఇచ్చింది. ఈ అమ్మడు షేర్‌చేసిన పిక్స్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



# ‘దృశ్యం 3’.. ఎవరి మాట వారిదే.. ఏది నిజమో!

విడుదలైన అన్ని భాషల్లోనూ ప్రేక్షకులను థ్రిల్ చేసిన మూవీ ఫ్రాంచైజీ ‘దృశ్యం’. ఈ సిరీస్‌లో మూడో భాగం ఇటు మలయాళంలో, అటు హిందీలో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే విడుదల తేదీలూ ఖరారయ్యాయి. హిందీ ‘దృశ్యం’, ‘దృశ్యం 2’పై పెద్దగా చర్చ జరగలేదుగానీ ‘దృశ్యం 3’ స్టోరీపై మాత్రం రూమర్స్ వస్తూనే ఉన్నాయి. వేరే కొత్త కథతో హిందీ ‘దృశ్యం 3’ని తెరకెక్కిస్తున్నారంటూ జరిగిన ప్రచారాన్ని ఇప్పటికే.. మాతృక మూవీ దర్శకుడు జీతూ జోసెఫ్ ఖండించారు. తాను రాసిన కథతోనే హిందీ చిత్రం కూడా రూపొందుతుందన్నారు. కానీ, ఆ సినిమా హీరోయిన్ శ్రియ కామెంట్స్‌తో సినీ ప్రియుల్లో మరోసారి చర్చ మొదలైంది.




తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. మలయాళం ‘దృశ్యం 3’కి చాలా భిన్నంగా హిందీ ‘దృశ్యం 3’ ఉంటుందని తెలిపారు. ‘దృశ్యం’ ఫ్రాంచైజీ తనకు ఓ ఎమోషనల్ జర్నీ అని పేర్కొన్నారు. రెండు భాగాలను మించి మూడో భాగం ఉంటుందన్నారు. మరి, ఎవరి మాట నిజమో తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. మలయాళం ‘దృశ్యం 3’ ఏప్రిల్ 2న, హిందీ ‘దృశ్యం 3’ అక్టోబరు 2న విడుదల కానున్నాయి. మలయాళంలో ‘దృశ్యం’ మూడు భాగాలకు జీతూ జోసెఫ్ దర్శకుడు. మోహన్‌లాల్ హీరో. హిందీలో ‘దృశ్యం’ను నిషికాంత్ కామత్ రూపొందించగా.. ‘దృశ్యం 2’, ‘దృశ్యం 3’ సినిమాకు అభిషేక్ పాఠక్ డైరెక్టర్. అజయ్ దేవ్‌గణ్ కథానాయకుడు. తెలుగులోనూ ‘దృశ్యం 3’ త్వరలో పట్టాలెక్కే అవకాశాలున్నాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో నటిస్తున్న ‘ఆదర్శ కుటుంబం’ పూర్తయ్యాక.. వెంకటేశ్ ‘దృశ్యం 3’ మొదలుపెడతారని సమాచారం.

# చిన్నగా 'మాయ' చేయొచ్చు!



ఆఫీసు అయినా, ప్రయాణమైనా... 'ముందు జాగ్రత్త' మీదే మన దృష్టి కదూ! అనుకోకుండా పార్టీకి పిలుపు రావొచ్చు. హడావుడిగా సిద్ధమవ్వాల్సి ఉండొచ్చు. అవసరం ఏదైనా అప్పటికప్పుడు కంగారుపడటం మనకు నచ్చదు. కాబట్టే, మనదైన కిట్ హ్యాండ్ బ్యాగులో ఎప్పుడూ ఉండాల్సిందే. కానీ రోజూ ఆ బరువు మోయాలా? చిన్నగా వీటిని ప్రయత్నిస్తే పోలా!



**రంగుల క్యాప్సూల్**

పెదాలకు రంగులద్దడం వయసుతో సంబంధం లేకుండా ప్రతి అమ్మాయీ మెచ్చే పని. మేకప్ మీద ఆసక్తి లేకపోయినా ఆఫీసులు, కాలేజీలకు దీన్ని మాత్రం రోజువారీగా ప్రయత్నించేవాళ్లూ చాలామందే. అంతేనా, మూడ్‌ని బట్టి షేడ్‌ని ఎంచుకుంటుంటారు. అంటే బ్యాగులో కనీసం రెండు మూడైనా ఉండాల్సిందేగా! ఈ చిట్టి మ్యాటే లిప్‌స్టిక్‌లు తీసుకోండి. రెండు మూడేంటి ఎన్నైనా పెట్టేసుకోవచ్చు. పైగా బరువు తక్కువ.

**కురులనీ మెరిపించొచ్చు**

ముఖాన్ని అయితే మేకప్‌తో మాయ చేయొచ్చు. మరి కురుల సంగతేంటి? పొరపాటున వారం రోజులు ఊరెళ్తున్నామంటే షాంపూ శాచెట్లు తీసుకెళ్లొచ్చు. కండిషనర్ అలాకాదుగా! మరి









పరిష్కారం ఏంటంటే... ఈ హెయిర్ క్యాప్సూల్సే. చిట్టిగా ఉన్న వీటిని తుంచి, సీరమ్‌ను కురులకు పట్టిస్తే సరి. చక్కగా మెరుస్తూ నిగనిగలాడతాయి.

**మేకప్ అద్దేయొచ్చు**

ఫౌండేషన్, కన్సీలర్... ముఖం మెరిపించాలంటే ఈ బేసిక్ ఉత్పత్తులు కావాల్సిందే. వీటినీ ఏ జంజాటం లేకుండా తీసుకెళ్లొచ్చు. మేకప్ క్యాప్సూల్స్ అందుకు వచ్చినవే. కొన్ని అయితే బీబీ, సీసీ క్రీమ్‌ల్లా ఒకటే రాసుకుంటే సరిపోయేలానూ వస్తున్నాయి. ముఖానికి అలా టచప్ ఇచ్చేస్తే చాలు. పర్‌ఫెక్ట్ లుక్‌తో బయటికి వెళ్లిపోవచ్చు. బరువు లేకుండా... అందం విషయంలో రాజీ పడకుండా ఈ చిట్టి నేస్తాలు భలేగున్నాయి కదూ! కీ చెయిన్‌కి చిట్టి బ్యాగు తగిలించుకునీ వీటిని సర్దేసుకోవచ్చు. ఇంకేం ప్రయత్నించేయండి మరి.

# వయసు కనిపించకుండా..!

వయసు పైబడుతున్న కొద్దీ ముఖంపై ముడతలు ఏర్పడటం సహజం. దీనిని నివారించడానికి చాలామంది తరచూ బ్యూటీపార్లర్‌కి వెళుతుంటారు. యాంటీ ఏజింగ్ క్రీములు రాయడం, ట్రీట్‌మెంట్ తీసుకోవడం చేస్తుంటారు. అయితే వీటితో పాటు ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా మరింత యవ్వనంగా కనిపించవచ్చు అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో- ఆహారంలో తప్పనిసరిగా భాగం చేసుకోవాల్సిన కొన్ని పదార్థాల గురించి తెలుసుకుందామా..







**ఉసిరి..**

ఉసిరిలో విటమిన్ 'సి' అధికంగా లభిస్తుంది. అలాగే చర్మపోషణకు అవసరమైన ఖనిజ పదార్థాలు కూడా ఇందులో పుష్కలంగా లభిస్తాయి. దీనిలోని పోషకాలు రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చూస్తాయట. దీనివల్ల చర్మానికి సరైన పోషణ అందుతుంది. ఫలితంగా చర్మం ముడతలు పడటం తగ్గి యవ్వనంగా కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఉసిరిని తినడం వల్ల జుట్టు రాలే సమస్య కూడా తగ్గే అవకాశం ఉందంటున్నారు.

**సాల్మన్ చేపలు..**

సాల్మన్ చేపలో ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మ కణాలు పాడవకుండా రక్షణ కల్పిస్తాయట. ఫలితంగా చర్మం ఆరోగ్యంగా తయారవుతుంది అంటున్నారు నిపుణులు.

**ఆలివ్ నూనె..**

ఆలివ్ ఆయిల్ ఆరోగ్యానికి, అందానికి మేలు చేస్తుందన్న విషయం తెలిసిందే. దీనిలో ఉండే పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, మోనోశ్యాచురేటెడ్ కొవ్వులు.. వృద్ధాప్య ఛాయలు రానివ్వకుండా చేస్తాయి. అందుకే వంటల్లో ఆలివ్‌నూనెను కూడా చేర్చుకోవాలి. అలాగే అప్పుడప్పుడు ఆలివ్ నూనెతో చర్మాన్ని మర్దన చేసుకుంటూ ఉండాలని చెబుతున్నారు నిపుణులు.

**డార్క్ చాక్లెట్..**

సూర్యరశ్మి, అతినీలలోహిత కిరణాల ప్రభావం వల్ల కూడా చిన్న వయసులోనే చర్మం ముడతలు పడుతుంది. కొకోవా బీన్స్‌తో తయారు చేసిన డార్క్ చాక్లెట్ ఈ ప్రభావాన్ని కాస్త తగ్గిస్తుందట.



దీనిలో లభించే యాంటీఆక్సిడెంట్లు చర్మానికి రక్త ప్రసరణ సరిగా జరిగేలా చేస్తాయట. అలాగే ఇది చర్మం తేమను కోల్పోకుండా కాపాడుతుందట. ఫలితంగా చర్మం యవ్వనంగా కనిపిస్తుందంటున్నారు నిపుణులు.

**డ్రై ఫ్రూట్స్..**

బాదం, జీడిపప్పు, పిస్తాలాంటి గింజలను తినడం ద్వారా అన్‌శ్యాచురేటెడ్ కొవ్వులు, విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వంటివి పుష్కలంగా లభిస్తాయి. వీటివల్ల ఆరోగ్యంగానే కాదు.. అందంగానూ తయారవ్వచ్చు. అయితే వీటిని మరీ ఎక్కువగా తినడం వల్ల లావయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల మోతాదు మించకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* నారింజ జాతి పండ్లలో నీటి శాతం ఎక్కువ ఉంటుంది. అలాగే విటమిన్ 'సి' కూడా పుష్కలంగా లభిస్తుంది. ఇది చర్మ ఆరోగ్యానికి ఎంతో తోడ్పడుతుంది.
* రోజూ సరైన మోతాదులో నీళ్లు తాగడం వల్ల చర్మానికి కావాల్సిన తేమ అందుతుందని చెబుతున్నారు నిపుణులు.







# మనసు పెట్టి తింటున్నారా?

**ఆహారం పైనే పూర్తి దృష్టి పెట్టాలన్నా, రుచిని ఆస్వాదించాలన్నా.. భోజనం చేసే క్రమంలో కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు నిపుణులు.**

* తినేటప్పుడు మొబైల్, టీవీ.. తదితర గ్యాడ్జెట్స్‌కి దూరంగా ఉండాలి.
* పనులున్నాయని గబగబా తినేయడం కాకుండా.. 2030 నిమిషాల సమయం భోజనానికి కేటాయించాలి.
* ఎంత తింటామో, అంతా ఒకేసారి ప్లేట్లో పెట్టుకోవడం కాకుండా.. కొద్దికొద్దిగా ఆహారం ప్లేట్లో వడ్డించుకోవాలి. ఎందుకంటే ఒకేసారి ఎక్కువ మొత్తంలో ఆహారం ప్లేట్లో కనిపిస్తే త్వరగా తినేయాలన్న ఆతృత పెరుగుతుంది. తద్వారా మనసు పెట్టి తినలేం. కాబట్టి తక్కువ మొత్తంలో.. ఓ ముద్ద తగ్గించి తినడం మంచిది.
* కొంతమంది ఆహారాన్ని నమలకుండా మింగేస్తుంటారు. దీనివల్ల ఆహారం రుచిని ఆస్వాదించలేకపోతారు. ఇదీ మనసు పెట్టకుండా తిన్నట్లేనట! అందుకే నోట్లో పెట్టుకున్న ముద్దను నెమ్మదిగా నములుతూ.. రుచిని ఆస్వాదిస్తూ తింటే ఆహారంపై ప్రేమ పెరుగుతుంది.
* తినే ముందు, మధ్యలో, తిన్నాక.. ఇలా ఎప్పటికప్పుడు ఆకలిని పరిశీలించుకుంటూ తినడం ముఖ్యం. తద్వారా శరీరానికి ఎంత ఆహారం అవసరమో అన్న విషయం అవగతమవుతుంది. ఫలితంగా ఎక్కువ ఆహారం తినకుండా జాగ్రత్తపడచ్చు.
* చాలామందికి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూ తినడం అలవాటు! ఈ క్రమంలో ఇతర విషయాలు కాకుండా.. మీరు తినే ఆహారం గురించే మాట్లాడుకోవడం, ఆరోగ్యకరమైన ఆప్షన్ల గురించి పంచుకోవడం, రుచుల్ని ప్రశంసించడం కూడా మైండ్‌ఫుల్ ఈటింగ్ కిందకే వస్తుంది.
* కొంతమందికి డైరీ రాయడం అలవాటు! ఇలాంటి వారు ఫుడ్ డైరీ అలవాటు చేసుకోవచ్చు. ఇందులో భాగంగా ఆ రోజు తిన్న ఆహార పదార్థాలువాటిలోని పోషకాల గురించి అందులో పొందుపరచుకోవచ్చు.. ఫలితంగా ఆహారంపై ప్రేమ పెరుగుతుంది. హెల్దీ ఆప్షన్లు ఎంచుకోవాలన్న మక్కువా అలవడుతుంది.

# జనవాసాల మధ్య సెల్ టవర్ వద్దు: గీతానగర్ కాలనీవాసుల ఆందోళన

ఎల్బీనగర్, జనవరి 29 (భారత శక్తి): జన నివాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం చేపట్టవద్దని డిమాండ్ చేస్తూ గీతానగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గీతానగర్ కాలనీలో నిర్మిస్తున్న సెల్ టవర్ వద్ద కాలనీవాసులు ఆందోళన చేపట్టారు.



ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వరప్రసాద్ రావు మాట్లాడుతూ.. వంద మీటర్ల ఎత్తుతో ఏర్పాటు చేస్తున్న ఈ సెల్ టవర్ వల్ల వెలువడే రేడియేషన్ కారణంగా స్థానికులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జనవాసాల మధ్య ఈ నిర్మాణం చేపట్టడం సరికాదన్నారు.

**అధికారులు పట్టించుకోవడం లేదు:**

సెల్ టవర్ నిర్మాణంపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎవరూ స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివారు కాలనీల్లో ప్రశాంతంగా జీవిస్తున్న తమకు రేడియేషన్ ముప్పును తెచ్చిపెట్టవద్దని, తక్షణమే నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, సంక్షేమ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గమనిక: మీ వార్తలో "వంద మీటర్ల ఎత్తు" అని ఉంది. సాధారణంగా సెల్ టవర్లు 30 నుండి 60 మీటర్ల లోపే ఉంటాయి. ఒకవేళ ఇది నిజంగానే భారీ టవర్ అయితే అలాగే ఉంచండి, లేదంటే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవచ్చు.




# గ్రామీణ మహిళల ఆరోగ్య రక్షణే లక్ష్యం

* **సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్**
* **ఆరోగ్య మహిళ పీహెచ్సీలు, మొబైల్ క్యాంపులతో మహిళలకు వైద్య సేవలు: జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య**

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి (జనవరి 28): గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు వచ్చే రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసిందని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్నారు.తెలంగాణ ప్రభుత్వం సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ - గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలోబుధవారం సంగారెడ్డి లోని ఎస్ ఎస్ గార్డెన్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్తో పాటు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు, వైద్య సలహాలు అందిస్తామని తెలిపారు.క్యాన్సర్‌పై ఉన్న భయాలు, అపోహలను తొలగించి మహిళల్లో ధైర్యం నింపడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు తమ ఆరోగ్యాన్ని పక్కన పెట్టి కుటుంబం కోసం ఎక్కువగా శ్రద్ధ చూపుతారని, దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. మహిళలకు ప్రధానంగా వచ్చే క్యాన్సర్లు రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ అని, వీటిని తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా అరికట్టే అవకాశం ఉందన్నారు.ఇందిరా మహిళా శక్తి, మహిళల కు ముందుగా అవగాహన కల్పించి వారి ద్వారా మహిళలందరికీ విస్తృత అవగాహన కల్పించడంతో క్యాన్సర్ ను అరికట్టవచ్చని అన్నారు. మహిళలు తప్పనిసరిగా తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో ఎత్తు, బరువు తక్కువ పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఎన్ ఆర్ .ఇ జి ఎస్ కార్యక్రమం ద్వారా న్యూట్రిషన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆరోగ్య మహిళ పీహెచ్సీలుగా గుర్తించామని తెలిపారు. అక్కడ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మహిళా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో మొబైల్ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏసీ బస్సులతో కూడిన ఈ మొబైల్ క్యాంపుల్లో ఆధునిక వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. మేజర్ జీపీలలో, మండల కేంద్రాలలో ఈ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చుట్టుపక్కల ప్రాంతాల మహిళలు మొబైల్ క్యాంపులను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు సంకోచం విడిచిపెట్టి రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జిల్లాలో ప్రతి గ్రామానికి ఈ అవగాహన కార్యక్రమం చేరేలా చర్యలు తీసుకోవాలని మహిళాసంఘాలకు సూచించారు. అవసరమైన మహిళలకు మెరుగైన వైద్య చికిత్స అందేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, ఏఐజి హాస్పిటల్ అంకాలాజిస్ట్ ఆంకో-ప్లాస్టిక్ సర్జన్ మరియు యూసీ బ్రెస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి నర్రా , జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు , ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళా సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

# సుప్రియ పిళ్ళైస్ కిచెన్ గ్రాండ్ ప్రారంభించిన దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

* **వందల మందికి ఉచితంగా చికెన్ బిర్యానీ అందజేసిన నిర్వాహకులు**



ఎల్బీనగర్, జనవరి 28 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్ ఓల్డ్ ఫ్రూట్ మార్కెట్ ,నారాయణ కాలేజీ పక్క భవనం మొదటి అంతస్థులో సినీ నటి, మిస్ ఇండియా సౌత్ విన్నర్, సోషల్ వర్కర్ అండ్ ఫౌండర్ సుప్రియ పిళ్ళైస్ తను సొంతంగా ఏర్పాటు చేసిన సుప్రియ పిళ్ళైస్ కిచెన్ గ్రాండ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై కిచెన్ గ్రాండ్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.విశిష్ట అతిధులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహా గుప్తా, కిచెన్ గ్రాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి



సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా భోజన సదుపాయాల ఏర్పాటు ప్రజలకు మరింత చెరువుగా అయిందని ఎల్బీనగర్, చైతన్యపురి, దిల్సుఖ్ నగర్, కొత్తపేట దగ్గరలో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సుప్రియ పిళ్ళైస్ కిచెన్ ద్వారా మంచి రుచులు కలిగిన నాణ్యతతో కూడిన భోజనం 4ఏఎం బిర్యానీ సదుపాయాలు కల్పించి తక్కువ ధరలతో అందించడం చాల సంతోషకరమని అన్నారు. చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహా గుప్త మాట్లాడుతూ, నిత్యం రద్దీ గల ప్రాంతం, కాలనీ వాసులకు, వ్యాపారులకు, చిరు వ్యాపారస్తులకు, కార్మికులకు, యువతకు, వివిధ రకాల అయిన ప్రజలకు మంచి నాణ్యతతో కూడిన భోజనం అందించడం అది కూడా తక్కువ రేట్లకే అందించడం చాలా గొప్ప విషయమని అన్నారు. నూతనంగా ప్రారంభించిన సుప్రియ పిళ్ళైస్ కిచెన్ గ్రాండ్ మరింతగా అభివృద్ధి చెందాలని వారికి పలువురు ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. 4ఏఎం బిర్యానీ, వెజ్ మీల్స్, నాన్ వెజ్ మీల్స్ అలాగే విభిన్న రకాల రుచులతో ప్రత్యేకమైన ఆఫర్స్ తో సుప్రియ పిళ్ళైస్ కిచెన్ గ్రాండ్ నిర్వాహకురాలు సుప్రియ పిళ్ళైస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో యాద శంకర్, తోట మహేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, ఒగ్గు బీరప్ప,రవి ముదిరాజ్, బొగ్గారపు శరత్ చంద్ర, బొగ్గారపు వరుణ్, బాలరాజు, జైపాల్ రెడ్డి, భానుచందర్, హోటల్ నిర్వాహకులు కంటెంట్ క్రియేటర్, కో ఫౌండర్ రాజా పిళ్ళై, ఫిలిం యాక్టర్, కో ఫౌండర్ కానుకుంట్ల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. కిచెన్ గ్రాండ్ ఓపెనింగ్ సందర్భంగా నిర్వాహకులు వందల మందికి చికెన్ బిర్యానీ ఉచితంగా అందించడం స్థానిక నాయకులు, స్థానికులు అభినందించారు.

# నియోజకవర్గంలో ప్రతీ సమస్యపై అవగాహన ఉంది

: **ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**




ఎల్బీనగర్, జనవరి 28 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం డివిజన్ పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తమ కాలనీ సమస్యలపై నిర్వహించిన "చర్చా కార్యక్రమం"లో స్థానిక ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.కాలనీలో అక్కడక్కడ కరెంట్ సమస్య, రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,కుక్కల సమస్య,సీసీ కెమెరాల సమస్య లాంటివి పరిష్కరించాలని, రోడ్డు నంబర్లు 1 నుండి 3 వరకు పూర్తిగా దెబ్బతిన్నాయని నూతన రోడ్లు వేయాలని, ట్రాన్స్ఫార్మర్స్ మంజూరు అయినా ట్రాన్స్ఫార్మర్స్ నిర్మాణంలో పక్కన ఉన్న ఇతర స్థల యజమానులు అభ్యంతరం తెలపడంతో ట్రాన్స్ఫార్మర్స్ నిర్మాణం ఆగిపోయిందని అన్నారు.అలాగే కాలనీలో నూతన పార్కు నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, మీరు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.కరెంటు సమస్య లేకుండా మరొక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయిస్తానని, కాలనీ కమ్యూనిటీ హాల్ విస్తరణ కోసం పక్క లేఔట్ వాళ్లని రిక్వెస్ట్ చేసి సహకరిస్తానని అన్నారు. రేడియో స్టేషన్ దగ్గర రోడ్డు మార్గానికి, రోడ్డు విస్తరణకు కూడా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ట్రాఫిక్ సమస్యను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి త్వరలోనే చుట్టూ పక్కల కాలనీ వాసులతో పోలీస్ అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేస్తామని.నియోజకవర్గంలో ప్రతి సమస్యపైన నాకు అవగాహన ఉందని త్వరలోనే ప్రతి ఒక్కటి పరిష్కరిస్తానని, అలాగే నూతన రోడ్లు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిట్టా రాజశేఖర్ రెడ్డి,చింతల రవికుమార్, లగ్గోని శ్రీధర్ గౌడ్,దూసరి మధుగౌడ్, నవీద్ కాలనీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాస రావు,కోశాధికారి విజయ్ కుమార్,ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సయ్యద్ జాహీద్ అలీ,మల్లేశ్,జాయింట్ సెక్రటరీ రఘుపతి,ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో

# ఎస్.డి.భవానీకి పీహెచ్డీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 28 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ఎస్.డి.భవానీ డాక్టరేట్ కు అర్హత సాధించారు. గాడోలియనండోప్ చేయబడిన నికెల్ ఫెరైట్ నానోపార్టికల్స్ యొక్క లక్షణాలపై భస్మీకరణ ఉష్ణోగ్రత, కూర్పు యొక్క ప్రభావం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.పూర్ణచంద్రరావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ భవానీ అధ్యయనం, సోల్‌జెల్ ఆటో దహన పద్ధతిని ఉపయోగించి జీడీడోప్డ్ నికెల్ ఫెరైట్ నానోపార్టికల్స్ యొక్క సంశ్లేషణ, లక్షణాలను అన్వేషించినట్టు తెలియజేశారు. వాటి నిర్మాణ, క్రియాత్మక లక్షణాలపై కాల్సినేషన్ ఉష్ణోగ్రత ప్రభావాన్ని పరిశీలించామన్నారు.ఈ పరిశోధన ఫలితాలు అధికఫ్రీక్వెన్సీ ఎలక్ట్రానిక్స్, మాగ్నెటిక్ పరికరాలు, ఈఎంఐ షీల్డింగ్, మైక్రోవేవ్ టెక్నాలజీలలో అనువర్తనాల కోసం ఈ నానోమెటీరియల్ల సామర్థ్యాన్ని హైలైట్



చేస్తాయని తెలిపారు.డాక్టర్ భవానీ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# చెరువు పరిసరాల్లో దోమల నివారణకు కఠిన చర్యలు



* **కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి**

ఎల్బీనగర్, జనవరి 28 (భారత శక్తి): శుభోదయం గడ్డిఅన్నారం కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని తిరుమలానగర్ కాలనీ, సరూర్‌నగర్ చెరువు వద్ద బుధవారం గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి సరూర్నగర్ జిహెచ్ఎంసి సర్కిల్ 5 డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఎంటమాలజీ ఏఈ రాంబాబులతో కలిసి సరూర్నగర్ చెరువు వద్ద పర్యటించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ చెరువు పరిసర ప్రాంతాల్లో దోమల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సరూర్‌నగర్ చెరువు దిగువ ప్రాంతంగా గడ్డిఅన్నారం డివిజన్ ఉండటంతో, చెరువులో మురుగు నీరు పూర్తిగా నిండిపోవడం వల్ల పరిసర కాలనీల్లో దోమల విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. దోమల కారణంగా ప్రజలు జ్వరాలు, వైరల్ ఫీవర్లు వంటి ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గత వినాయక చతుర్థి సందర్భంగా సరూర్‌నగర్ చెరువులోకి వేసిన వినాయక విగ్రహాల వ్యర్థాలు, పూజా సామగ్రి, ఇతర చెత్త ఇప్పటివరకు పూర్తిగా తొలగించకపోవడం వల్ల నీరు కలుషితమై దోమల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం వారానికి ఒకసారి మాత్రమే జరుగుతున్న దోమల ఫాగింగ్ సరిపోదని, దోమల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వారానికి కనీసం మూడుసార్లు ఫాగింగ్ నిర్వహించాలని అధికారులను డిమాండ్ చేశారు. అలాగే ఆంటి లార్వా స్ప్రే పనులు నిరంతరం చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ కాలనీవాసులు,జిహెచ్ఎంసి వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో భక్తులకు ధరల షాక్.. ఆకాశాన్నంటిన రేట్లు..

ములుగు, జనవరి 28 (భారత శక్తి): తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అయితే, వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ధరల మోత తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. జాతర పరిసరాల్లో నిత్యావసరాల నుంచి బస చేసే గదుల వరకు అన్ని ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

*** కోడి, మేకల ధరలు రెట్టింపు.. భక్తుల జేబులకు చిల్లు**

జాతరలో అమ్మవార్లకు మొక్కుగా బెల్లం (బంగారం) తో పాటు కోళ్లు, మేకలను సమర్పించడం ఆనవాయితీ. దీన్నే అదునుగా చేసుకున్న వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేశారు. సాధారణంగా కిలో రూ. 420 పలికే మేకపోతు లైవ్, మేడారంలో రూ. 900 నుంచి రూ. 1000 వరకు విక్రయిస్తున్నారు. ఇక, మటన్ ధర అయితే ఏకంగా రూ. 1500కు చేరింది. బయట మార్కెట్‌లో కిలో రూ. 170180 ఉండే బ్రాయిలర్ కోడిని ఇక్కడ రూ. 300 నుంచి రూ. 350కి అమ్ముతున్నారు. నాటుకోడి ధర రూ. 700 దాటిపోయింది. జాతర చివరి రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు వాపోతున్నారు.

*** చుక్కలు చూపిస్తున్న గదుల అద్దెలు**

మాంసం ధరలే కాకుండా, బస కోసం ఏర్పాటు చేసుకునే గదుల అద్దెలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేని చిన్న గదులకు సైతం రోజుకు రూ. 6,000 వరకు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కేవలం ఒక్క ఫ్యాన్ మాత్రమే ఉన్న గదికి వేలకు వేలు చెల్లించాల్సి వస్తోంది.

*** చెట్ల కింద నీడకు సైతం అద్దె**

ఇక ఇళ్లు, గదులు దొరకని వారు సేద తీరేందుకు చెట్ల నీడను ఆశ్రయిస్తుంటే, అక్కడ కూడా దోపిడీ తప్పడం లేదు. జాతర పరిసరాల్లోని తోటల యజమానులు చెట్ల కింద నీడను సైతం అద్దెకు ఇస్తున్నారు. ఓ కుటుంబం వంట చేసుకుని, భోజనం చేయడానికి ఒక చెట్టు కింద నీడ కోసం రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికంగానే కొనుగోలు చేయాల్సి రావడంతో, వ్యాపారులు ఈ విధంగా ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దోపిడీని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## అజిత్ పవార్ మృతికి ఏపీ కేబినెట్ సంతాపం

అమరావతి, జనవరి 28 (భారత శక్తి): విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించడంపై ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సంతాపం తెలిపింది. ఈ రోజు ఉదయం జరిగిన కేబినెట్ సమావేశంలో సంతాప తీర్మానం చేసింది. భేటీ ప్రారంభమైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అజిత్ పవార్ విమాన ప్రమాద వార్తను ప్రస్తావించారు. ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యానని చంద్రబాబు చెప్పారు. అజిత్ పవార్ తో తనకున్న పరిచయాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. అజిత్ పవార్ మృతి మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని లోటని చంద్రబాబు అన్నారు. అజిత్ పవార్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మంత్రులు మౌనం పాటించారు.

## శబరిమల బంగారం కేసులో కీలక మలుపు.. వీడిన చిక్కుముడి!

కేరళ, జనవరి 28 (భారత శక్తి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శబరిమల గర్భగుడి స్వర్ణ బంధనం (బంగారు తాపడం) చోరీ కేసులో కీలక పురోగతి లభించింది. గర్భగుడి తలుపులను మార్చలేదని, వాటిపై ఉన్న రాగి రేకుల మీద నుంచి బంగారు పొరను మాత్రమే నేర్పుగా దోచుకున్నారని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. ఈ మేరకు విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (VSSC) శాస్త్రవేత్తలు సమర్పించిన నివేదికను, ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) బుధవారం కేరళ హైకోర్టుకు సమర్పించింది. ప్రస్తుతం గర్భగుడికి ఉన్నవి అసలైన రాగి రేకులేనని, వాటిని మార్చలేదని వీఎస్ఎస్‌సీ శాస్త్రవేత్తలు తమ నివేదికలో స్పష్టం చేశారు. తలుపుల చెక్క ఫ్రేమ్‌వర్క్ (స్థానికంగా 'కట్టిల్' అంటారు) కూడా పాతదేనని నిర్ధారించారు. దొంగిలించబడింది ఘనమైన బంగారం కాదని, రాగి రేకులపై ఉన్న బంగారు పొర మాత్రమేనని తేల్చారు. కొన్ని రేకులపై బంగారం శాతం గణనీయంగా తగ్గడాన్ని బట్టి, రసాయనాలను ఉపయోగించి బంగారాన్ని వేరు చేసి ఉంటారని అంచనా వేశారు. రేకులపై కనిపించిన మార్పుల వల్ల వాటిని పూర్తిగా మార్చేసి ఉంటారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. అయితే, బంగారం వెలికితీతకు ఉపయోగించే పాదరసం వంటి రసాయనాల ప్రయోగం వల్లే వాటి ఉపరితలంలో మార్పులు వచ్చాయని, భౌతికంగా వాటిని మార్చలేదని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ వాదనతో అంతర్జాతీయ ముఠాలకు విక్రయించి ఉంటారన్న ఊహాగానాలకు తెరపడినట్టయింది. ఈ కేసుకు సంబంధించి మరిన్ని విశ్లేషణలు కొనసాగుతున్నాయని, పాత గర్భగుడి తలుపుల నమూనాలతో పోల్చి తుది నివేదికను త్వరలోనే సమర్పిస్తామని వీఎస్ఎస్‌సీ అధికారులు సిట్‌కు తెలిపారు. ఈ శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తునకు స్పష్టమైన దిశానిర్దేశం లభించింది. గర్భగుడి నిర్మాణాలను మార్చకుండా, కేవలం రసాయన ప్రక్రియ ద్వారా బంగారాన్ని ఎలా దొంగిలించారు, ఈ నేరం వెనుక ఉన్నదెవరు అనే కోణంలో ఇప్పుడు విచారణ జరగనుంది.

### చుక్కలనంటిన పసిడి, వెండి..

## రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు

ఢిల్లీ, జనవరి 28 (భారత శక్తి): బంగారం, వెండి ధరల పరుగు ఆగడం లేదు. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల కారణంగా పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పసిడి, వెండికి డిమాండ్ పెరిగి ధరలు రికార్డు స్థాయికి దూసుకెళ్తున్నాయి. తాజాగా బంగారం ధర పది గ్రాములకు రూ.3,220 మేర పెరిగింది. వెండి సైతం కిలోకు ఏకంగా సుమారు రూ.10,000 పెరగడం గమనార్హం. ఈరోజు ఉదయం 11:00 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,65,170కి చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,950 పెరిగి రూ.1,51,400 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే పరిస్థితి ఉంది. అక్కడ 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,65,300 ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,51,550గా నమోదైంది.

**వెండిది కూడా అదే జోరు**

మరోవైపు బంగారం బాటలోనే వెండి కూడా పరుగులు పెడుతోంది. నిన్నటితో పోల్చితే కిలో వెండిపై రూ.10,000 పెరిగి, హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.4,00,000కి చేరింది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.3.8 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం: రాష్ట్రపతి ముర్ము

ఢిల్లీ, జనవరి 28 (భారత శక్తి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

### ఫిబ్రవరి 3 నుంచి


## సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం



హైదరాబాద్, జనవరి 28 (భారత శక్తి): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్రంలో పర్యటించనున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన.. నెలాఖరుకు స్వదేశానికి తిరిగి వస్తారు. ఫిబ్రవరి 3న నల్గొండ జిల్లా మిర్యాల గూడ, 4న కరీంనగర్ జిల్లా జగిత్యాల, 5న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో సీఎం రేవంత్ పర్యటిస్తారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు 890 మంది అభ్యర్థుల నుంచి 902 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో 382 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, 258 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు, 169 మంది భాజపా అభ్యర్థులు ఉన్నారు.

## నిఫా ఎఫెక్ట్: ఎయిర్‌పోర్టుల్లో మళ్లీ కొవిడ్ తరహా స్క్రీనింగ్

జనవరి 28 : పశ్చిమ బెంగాల్‌లో నిఫా వైరస్ కేసులు వెలుగుచూడటంతో పలు ఆసియా దేశాలు అప్రమత్తమయ్యాయి. థాయ్‌లాండ్, నేపాల్, తైవాన్ వంటి దేశాలు తమ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కొవిడ్ తరహా ఆరోగ్య తనిఖీలను పునఃప్రారంభించాయి. అయితే, బెంగాల్‌లో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఇప్పటివరకు కేవలం రెండు కేసులే నమోదయ్యాయని భారత కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చే ప్రయాణికుల కోసం థాయ్‌లాండ్‌లోని సువర్ణభూమి, డాన్ ముయాంగ్, ఫుకెట్ విమానాశ్రయాల్లో జనవరి 25 నుంచి థర్మల్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ప్రయాణికులు ఆరోగ్య సమాచారాన్ని తెలిపే ఫారాలను నింపాల్సి ఉంటుంది. జ్వరం వంటి లక్షణాలు ఉంటే వారిని ఐసోలేషన్‌కు తరలిస్తున్నారు. ఇదే తరహా చర్యలను నేపాల్ ప్రభుత్వం ఖాట్మండు విమానాశ్రయంతో పాటు భారత్‌తో ఉన్న సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కూడా ప్రారంభించింది. పశ్చిమ బెంగాల్‌లో డిసెంబర్ 2025 నుంచి ఇద్దరు ఆరోగ్య కార్యకర్తలకు నిఫా సోకినట్లు జనవరి 13న అధికారికంగా నిర్ధారించారు. ఈ రెండు కేసులకు సంబంధించి 196 మందిని గుర్తించి పరీక్షించగా, అందరికీ నెగెటివ్ వచ్చినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ జనవరి 27న ఒక ప్రకటనలో తెలిపింది. మీడియాలో వస్తున్న అధిక సంఖ్య కేసుల వార్తలు కేవలం ఊహాగానాలేనని కొట్టిపారేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం నిఫా వైరస్ మరణాల రేటు 40 నుంచి 75 శాతం వరకు ఉండటం, దీనికి నిర్దిష్ట చికిత్స లేదా వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో స్వల్ప సంఖ్యలో కేసులు నమోదైనా ఆయా దేశాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తైవాన్ కూడా నిఫా వైరస్‌ను అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల జాబితాలో చేర్చేందుకు ప్రతిపాదనలు చేసింది.



## ప్రియుడి మోజులో పడి.. తల్లిదండ్రులకు విషం ఇంజక్షన్ ఇచ్చి చంపిన కుమార్తె

వికారాబాద్, జనవరి 28 (భారత శక్తి): వికారాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడి మోజులో పడి తల్లిదండ్రులకు కుమార్తె విషం ఇంజక్షన్ ఇచ్చి హతమార్చింది. అప్పుల బాధతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకుని ఉంటారని తొలుత భావించినా.. పోలీసుల విచారణలో కుమార్తె బండారం బట్టబయలైంది. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బంట్వారం మండలం యాచారం గ్రామానికి చెందిన దశరథ్, లక్ష్మిలకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్నకుమార్తె సురేఖ.. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. అక్కడ ఓ యువకుడితో ప్రేమలో పడింది. తల్లిదండ్రులు వారి ప్రేమకు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలోనే మరో యువకుడితో సురేఖకు పెళ్లిచూపులు ఏర్పాటు చేశారు. పెళ్లిచూపుల నుంచి ఎలాగైనా తప్పించుకోవాలని భావించిన యువతి.. మోకాళ్ల నొప్పులకు అని చెప్పి తల్లిదండ్రులకు ఆదివారం వేర్వేరుగా విషం ఇంజక్షన్ ఇచ్చింది. వారు చనిపోయాక ఇద్దరినీ ఇంట్లో ఒకే చోట పడుకోబెట్టింది. అనంతరం ఏమీ తెలియనట్లు సోదరుడు అశోక్‌కు ఫోన్ చేసి తల్లిదండ్రులు స్పృహ తప్పి పడిపోయారని చెప్పింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కుమార్తె సురేఖే వారిని చంపినట్లు నిర్ధారణ అయింది. నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### విమాన ప్రమాదంలో

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

మహారాష్ట్ర, జనవరి 28 (భారత శక్తి): మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న చిన్న విమానం బారామతి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన నాలుగు బహిరంగ సభల్లో పాల్గొనేందుకు అజిత్ పవార్ ఈ ఉదయం ముంబై నుంచి బారామతికి బయలుదేరారు. ఉదయం 8 గంటలకు ముంబై నుంచి టేకాఫ్ తీసుకున్న విమానం, గంట తర్వాత బారామతి ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా ప్రమాదానికి గురైంది. విమానంలో ప్రయాణిస్తున్న ఐదుగురూ అక్కడికక్కడే మృతి చెందినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వర్గాలు ధ్రువీకరించాయి. ప్రమాద స్థలంలో విమానం శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మంటలు, దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్సులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ హఠాత్పరిణామంతో మహారాష్ట్ర రాజకీయ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి.

### కీర్తిచక్ర మేజర్‌కు ఏపీ ప్రభుత్వం

## భారీ నజరానా.. రూ.1.25 కోట్ల నగదు బహుమతి

అమరావతి, జనవరి 28 (భారత శక్తి): కీర్తి చక్ర పురస్కార గ్రహీత, మేజర్ మల్లా రామ్‌గోపాల్‌నాయుడికి ఏపీ ప్రభుత్వం భారీ నగదు బహుమతి ప్రకటించింది. ఆయనకు రూ.1.25 కోట్లు అందిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులిచ్చారు. మేజర్ రామ్‌గోపాల్‌నాయుడు స్వస్థలం శ్రీకాకుళం జిల్లాలోని సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామం. 2023 అక్టోబర్ 26న జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో జరిగిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో మేజర్ రామ్‌గోపాల్ నాయుడు అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ప్రాణాలకు తెగించి ఉగ్రవాదులతో పోరాడి, తన సహచర సైనికుల ప్రాణాలను




కాపాడారు. ఆయన వీరత్వానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2024 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కీర్తి చక్ర పురస్కారాన్ని ప్రకటించింది. కుప్వారా జిల్లాలో ఉగ్రవాదులు చొరబడ్డారన్న సమాచారంతో రామ్‌గోపాల్ నాయుడు బృందం గాలింపు చర్యలు చేపట్టింది. స్థానిక ఇళ్లలో దాక్కున్న ఐదుగురు ఉగ్రవాదులు సైన్యంపై కాల్పులు జరపగా, మేజర్ రామ్‌గోపాల్ ఏమాత్రం వెనకాడకుండా ఎదురుదాడికి దిగారు. అత్యంత సమీపం నుంచి ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. మరో ఉగ్రవాది గ్రెనేడ్ విసరగా, చాకచక్యంగా తప్పించుకుని అతడిని కూడా హతమార్చారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం ఐదుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సాయుధ బలగాల్లో 'చక్ర' అవార్డులు పొందిన వారికి నగదు బహుమతులు అందించాలన్న ప్రభుత్వ విధానంలో భాగంగా ఏపీ సర్కార్ ఈ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. శౌర్య పురస్కారం అందుకున్న ఏకైక తెలుగు మేజర్‌గా ఆయన ప్రశంసలు అందుకుంటున్నారు.



# క్లీన్ సిటీయే లక్ష్యం.. ఇంజనీర్లకు శిక్షణ

* **స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26పై అధికారుల ఓరియెంటేషన్**
* **వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు: అదనపు కమిషనర్ రఘు ప్రసాద్**

హైదరాబాద్, జనవరి 28 (భారత శక్తి) : నగర పారిశుధ్య వ్యవస్థను బలోపేతం చేసి, స్వచ్ఛ సర్వేక్షణ్ 202526లో హైదరాబాద్‌కు టాప్ ర్యాంకు తీసుకురావడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో నూతనంగా నియమితులైన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (SWM) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (DyEEs), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (AEEs), అసిస్టెంట్ ఇంజినీర్లకు (AEs) ప్రత్యేక ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ అండ్ శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికారులకు క్షేత్రస్థాయి విధులపై దిశానిర్దేశం చేశారు.

**రూల్స్ పాటించాల్సిందే..**

ఈ సందర్భంగా రఘు ప్రసాద్ మాట్లాడుతూ.. నగరంలో పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరచడానికి ఇంజినీర్లు చురుగ్గా పనిచేయాలని సూచించారు. "ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2024"లో జరిగిన తాజా సవరణలను వివరించారు. నిబంధనల అమలులో కఠినంగా వ్యవహరించడం ద్వారానే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ఫలితాలు సాధించగలమని స్పష్టం చేశారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే ఆపరేషనల్ సవాళ్లను ఎలా అధిగమించాలో అధికారులకు వివరించారు.

**టూల్‌కిట్‌పై అవగాహన..**

SWM సూపరింటెండింగ్ ఇంజినీర్ గోపాల్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ 10వ ఎడిషన్ (2025-26) టూల్‌కిట్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా నిర్మాణ వ్యర్థాలు (C&D Waste), బల్క్ గార్బేజ్ జనరేటర్ల (BGG) నుంచి సేకరించే వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం అధికారులకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవసరమైన ఐఈసీ (IEC) మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ బాధ్యులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు





# సాగర్ రింగ్ రోడ్డు ఫ్లైఓవర్‌కు 'వంగ మధుసూదన్‌రెడ్డి' పేరు పెట్టాలి

* **జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి.**

హైదరాబాద్, జనవరి 28 (భారత శక్తి): సాగర్ రింగ్ రోడ్డులోని ఫ్లైఓవర్‌కు ఇటీవల అకాల మరణం చెందిన చంపాపేట డివిజన్ కార్పొరేటర్ దివంగత వంగ మధుసూదన్ రెడ్డి పేరు పెట్టాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి కోరారు. బుధవారం ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్‌కు మధుసూదన్ రెడ్డి పేరు నామకరణం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

**ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం:**

గత ఐదేళ్లుగా కౌన్సిల్ సమావేశాల్లో మధుసూదన్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం, నిధుల మంజూరు కోసం నిరంతరం గళం ఎత్తారని రాజశేఖర్ రెడ్డి గుర్తు చేశారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆయన సేవలకు గుర్తింపుగా ఫ్లైఓవర్‌కు ఆయన పేరు పెట్టడం సముచితంగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

**మేయర్‌ను కలిసిన నాయకులు:**

ఈ ప్రతిపాదనను స్టాండింగ్ కమిటీ ముందు ఉంచి ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కూడా కోరినట్లు రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. త్వరలోనే సాగర్ రింగ్ రోడ్ ఫ్లైఓవర్‌కు వంగ మధుసూదన్ రెడ్డి పేరు పెట్టేలా తన వంతు కృషి చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పథంలో హయత్ నగర్.. జనం చెంతకు కార్పొరేటర్!

* **సీనియర్ సిటిజన్లకు ప్రాధాన్యం,మౌలిక వసతులపై ఫోకస్**
* **క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనుల పరిశీలన.**
* **రూ. 42.50 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టిన నవజీవన్ రెడ్డి.**

హయత్ నగర్, జనవరి 28 (భారత శక్తి) : హయత్ నగర్ డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతోంది. అటు మౌలిక సదుపాయాల కల్పన, ఇటు ప్రజల సంక్షేమం లక్ష్యంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి దూకుడు పెంచారు. కాలనీల రూపురేఖలు మార్చడమే కాకుండా, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. బుధవారం డివిజన్ వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు పారిశుధ్య నిర్వహణను ఆయన పర్యవేక్షించారు.

* **వృద్ధులకు ప్రత్యేక గౌరవం.. హాల్ నిర్మాణం ప్రారంభం**

శారదా నగర్ కమ్యూనిటీ హాల్ భవనంలో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా నిర్మించనున్న హాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. సమాజంలో పెద్దల అనుభవం ఎంతో విలువైనదని, వారి కోసం ప్రత్యేక వసతులు కల్పించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు యాది రెడ్డి, సెన్సర్ బోర్డు సభ్యులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

* **వేగంగా అభివృద్ధి పనులు..రూ. 42.50 లక్షలతో సీసీ రోడ్లు**

డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్‌లో రూ. 42.50 లక్షల భారీ వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. "నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు" అని ఈ సందర్భంగా కార్పొరేటర్ స్పష్టం చేశారు.







దశలవారీగా ప్రతి కాలనీలో డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పనులతో కాలనీవాసులకు ఏళ్ల తరబడి ఉన్న రవాణా కష్టాలు తీరనున్నాయి.

* **క్షేత్రస్థాయిలో 'శానిటేషన్' తనిఖీ:**

కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా, భాగ్యలత సాయి నగర్ కాలనీలో శానిటేషన్ విధులను నవజీవన్ రెడ్డి స్వయంగా తనిఖీ చేశారు. శానిటేషన్ డి.ఇ నీలిమతో కలిసి సిబ్బంది హాజరు, చెత్త సేకరణ తీరును పరిశీలించారు.

కార్పొరేటర్ ఆదేశాలు: "డివిజన్‌ను క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచడమే మా టార్గెట్. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు."

అధికారులు, సూపర్వైజర్లు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. హయత్ నగర్ కార్పొరేటర్ అనుసరిస్తున్న వ్యూహం క్లియర్ గా కనిపిస్తోంది. ఒకవైపు వృద్ధుల సంక్షేమం (శారదా నగర్), మరోవైపు మౌలిక వసతులు (సాయి బాబా నగర్), ఇంకోవైపు పారిశుధ్యం (భాగ్యలత నగర్) ఇలా అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లడం డివిజన్ అభివృద్ధికి మేలు చేకూరుస్తోంది. ముఖ్యంగా అధికారులను క్షేత్రస్థాయికి తీసుకురావడం ద్వారా పనుల్లో వేగం పెరుగుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

: **కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**

ఎల్బీనగర్ జనవరి 28 ( భారత శక్తి) : రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని బి.ఎన్. రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ కాలనీలో రూ. 64 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని, ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం లెవెల్స్ సరిచూసుకుంటూ నిర్మాణం చేపట్టాలని సూచించారు. కాలనీవాసులకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా, యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శ్రీధర్, సుధీర్, పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం సూపర్వైజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 28 (భారత శక్తి) : జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. వీరా రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందించారు. అనంతరం ఇరువురు సమావేశమై, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు



సంబంధించి పలు అంశాలను చర్చించారు.

# అగ్ని ప్రమాదాలకు హైడ్రా.. చెక్..!

హైదరాబాద్ జనవరి 28 భారత శక్తి: విశ్వనగరం ఇప్పుడు 'విస్ఫోటన' నగరంలా మారుతోంది. నెలకో మూడు భారీ అగ్నిప్రమాదాలు.. ఏడాదికి 36 ఘటనలు.. లెక్కలేనంత ఆస్తి నష్టం.. మరెన్నో పచ్చి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అయినా వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. కేవలం లాభమే పరమావధిగా నిబంధనలను బుట్టదాఖలు చేస్తున్న 'వ్యాపార వెర్రి'పై హైడ్రా కన్నెర్ర చేసింది. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఇక తనిఖీల పర్వం కాదు.. నేరుగా 'సీజ్' పర్వమేనని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.



* **సెల్లార్ అంటే స్టాక్ రూమ్ కాదు!**

నగరంలోని మెజారిటీ వస్త్ర, ఫర్నీచర్ దుకాణాలు సెల్లార్లను 'డెత్ ట్రాప్'లుగా మార్చేశాయని హైడ్రా గుర్తించింది. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన చోట.. టన్నుల కొద్దీ మండే స్వభావం ఉన్న వస్తువులను కుక్కుతున్నారు. దీనికి తోడు అగ్నిప్రమాదం జరిగితే తప్పించుకోవడానికి మార్గం లేకుండా మెట్ల దారులను స్టాక్ గదులుగా మార్చడంపై కమిషనర్ సీరియస్ అయ్యారు. నాంపల్లి ఉదంతాన్ని గుర్తు చేస్తూ.. సెల్లార్లలో వాచ్‌మెన్ల నివాసాలు ఉండకూడదని, అవి కేవలం పార్కింగ్‌కే పరిమితం కావాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

* **విద్యుత్ సరఫరా బంద్.. నోటీసులు మస్ట్!**

* తనిఖీల పేరుతో కాలయాపన చేసే రోజులు పోయాయని, క్షేత్రస్థాయిలో నిబంధనలు పాటించని షాపులపై తక్షణ చర్యలు ఉంటాయని హైడ్రా హెచ్చరించింది.
* మొదటి దెబ్బ: నిబంధనలు లేని భవనాలకు వెంటనే పవర్ సప్లై కట్ చేస్తారు.
* రెండో చర్య: షాపును సీజ్ చేసి, గేట్లకు భారీ నోటీసు బోర్డులు తగిలిస్తారు.
* అవగాహన: "ఇది ప్రమాదకరమైన భవనం.. ఇక్కడ ఫైర్ సేఫ్టీ లేదు" అని రాసి ప్రజలను అప్రమత్తం చేస్తారు.

**హైడ్రా అస్త్రాలు ఇవే:**

* మెట్ల దారి నిఘా: సెల్లార్ నుండి టెర్రాస్ వరకు ఎగ్జిట్ పాయింట్లు లాక్ చేస్తే కఠిన చర్యలు.
* వసతిపై ఉక్కుపాదం: కమర్షియల్ కాంప్లెక్సుల్లో నివాస గదులు ఉంటే సహించేది లేదు.
* ఆటోమేషన్: మనుషుల ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే 'స్ప్రింక్లర్లు' పనిచేయాల్సిందే.
* స్టాఫ్ ట్రైనింగ్: షాపులో పనిచేసే ప్రతి ఒక్కరికీ ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్ వాడటం తెలిసి ఉండాలి.

**మీ చుట్టుపక్కల ముప్పు ఉందా?**

మీరు నివసించే అపార్ట్‌మెంట్లు లేదా పని చేసే ఆఫీసుల్లో అగ్నిప్రమాదానికి ఆస్కారం ఉన్న పరిస్థితులు కనిపిస్తే మౌనంగా ఉండకండి. వెంటనే 9000113667 నంబర్‌కు కరెంట్ లొకేషన్‌తో పాటు వీడియోలు, ఫోటోలు పంపండి. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచి, హైడ్రా బృందాలు తక్షణమే రంగంలోకి దిగుతాయి. మన నగరాన్ని అగ్ని ప్రమాదాల రహిత నగరంగా మార్చుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హైడ్రా కమిషనర్ పిలుపునిచ్చారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.